

TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 33 | హైదరాబాద్ | బుధవారం | 22-07-2026 | పేజీలు: 08


## ఇది కాలం తెచ్చిన కరవు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరవు

లక్సెట్టిపేట రైతు సదస్సులో కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు
యూరియా కొరత, కరెంటు కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపణ
పిడుగుపాటుతో మృతిచెందిన రైతు కుటుంబాలకు బీఆర్ఎస్ తరఫున ఆర్థిక సాయం
'ఇది ప్రకృతి కరవు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరవు' అంటూ కేటీఆర్ వ్యాఖ్యలు
కాళేశ్వరం ప్రాజెక్టుపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శ
కేసీఆర్ పాలనలో రైతులకు మెరుగైన మద్దతు లభించిందని కేటీఆర్ వ్యాఖ్య
'రైతులకు బీఆర్ఎస్ ఎప్పుడూ అండగా ఉంటుంది' అని హామీ
రేవంత్ ప్రభుత్వంలో రైతుల పరిస్థితి దిగజారిందని కేటీఆర్ ఆరోపణ
వ్యవసాయ రంగంపై కాంగ్రెస్ వైఖరిని తప్పుబట్టిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
రైతు సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసిన కేటీఆర్

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

రేవంత్‌రెడ్డి పాలనలో రైతులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (KTR) విమర్శించారు. రైతులు చనిపోయినా ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదన్నారు. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో నిర్వహించిన బీఆర్ఎస్ రైతు సదస్సులో ఆయన పాల్గొన్నారు. పిడుగుపాటుతో మరణించిన రైతు కుటుంబాలను పరామర్శించి పార్టీ తరఫున ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ''కాంగ్రెస్ పాలనలో యూరియా కష్టాలు, కరెంటు కోతలు, సాగునీటి అవస్థలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కేసీఆర్ పాలనలో నిరంతరాయంగా మిగతా 2లో..



## ఒట్ల మీద ఉన్న శ్రద్ధ.. నీటి బొట్ల మీద పెట్టు..

దేవాదుల ప్రాజెక్టుపై కాంగ్రెస్ వైఖరిని తప్పుబట్టిన హరీశ్‌రావు
'కాళేశ్వరం వద్ద రాజకీయం చేసి.. దేవాదులను ఎందుకు విస్మరించారు?' అంటూ ప్రశ్న
ఎల్‌నినో పేరుతో ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చొద్దని హెచ్చరిక
ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టే బాధ్యత ప్రభుత్వానిదేనని వ్యాఖ్య
'ఒట్ల కంటే నీటి బొట్లపై దృష్టి పెట్టాలి' అంటూ సీఎం రేవంత్‌కు సూచన
దేవాదుల విషయంలో కాంగ్రెస్‌దే చారిత్రక ద్రోహమని ఆరోపణ
తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో ప్రభుత్వంపై హరీశ్‌రావు విమర్శలు
నీటి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చరిత్ర క్షమించదని హెచ్చరిక
దేవాదుల ప్రాజెక్టు ఆలస్యానికి కాంగ్రెస్ ప్రభుత్వాలనే బాధ్యులుగా పేర్కొన్న హరీశ్‌రావు
ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలపై దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ నేత డిమాండ్



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

కాళేశ్వరం దగ్గర చిల్లర రాజకీయం చేశావని సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు. మరి దేవాదుల దగ్గర నీకు ఏం అడ్డమొచ్చిందని ప్రశ్నించారు. దేవాదుల విషయంలో నాటి నుంచి నేటి దాకా కాంగ్రెస్ పార్టీది ద్రోహమే అని మండిపడ్డారు. 2011లో మూడేళ్లు దేవాదులను మూలకు పడేసిందే కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు. ఎల్‌నినో పేరు చెప్పి ఎగనామం పెడితే బీఆర్ఎస్ ఊరుకోదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి బొట్టును ఒడిసి పట్టాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డికి ఉందని అన్నారు. మాట్లాడితే తిట్లు, ఒట్లు తప్ప ఏమీ లేదని మండిపడ్డారు. మొన్న రాములోరి మీద కూడా ఒట్టు పెట్టిండు అని తెలిపారు. ఒట్ల మీద ఉన్న శ్రద్ధ.. నీటి బొట్ల మీద పెట్టాలని హితవుపలికారు. లేదంటే చరిత్రహీనుడిగా మిగిలిపోవడం ఖాయమని హెచ్చరించారు. నీళ్లు రాకున్నా.. కరెంటు లేకున్నా రేవంత్ రెడ్డిదే బాధ్యత అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. జూన్ 1 నుంచి నేటి వరకు సమ్మక్క బ్యారేజీ మిగతా 2లో..



## నీట్ లీక్ ఘోర పాపం మళ్లీ జరగొద్దు

నీట్ పేపర్ లీక్‌పై ప్రధాని తొలి స్పందన
బాధ్యులకు కఠిన శిక్షలు తప్పవన్న మోదీ
లీకేజీల నివారణ జాతీయ బాధ్యతగా వ్యాఖ్య
యువతను తప్పుదారి పట్టించొద్దని ఎంపీలకు సూచన
పార్లమెంట్‌లో నిర్మాణాత్మక చర్చలకు సహకరించాలని పిలుపు

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. పేపర్ లీక్ అనేది ఘోర పాపమని, ఇలాంటి ఘటనలు దేశ భవిష్యత్తును దెబ్బతీస్తాయని ఆయన అన్నారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకతకు ఎలాంటి భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. పేపర్ లీక్‌కు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి మిగతా 2లో..

## గురుకులాల తనిఖీలకు డెడ్‌లైన్

మంత్రి పొన్నం ప్రభాకర్ కఠిన ఆదేశాలు
ఆర్‌సీవోలతో వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష
ఆగస్టు 30 గడువుగా తనిఖీల దిశగా అడుగులు
బీసీ గురుకులాల నిర్వహణపై పొన్నం సమీక్ష
వారంలో 3 రోజులు క్షేత్రస్థాయి పర్యటనలు
ప్రతి ఆర్‌సీవో కనీసం 6 పాఠశాలలను సందర్శించాలి
సొంత భవనాలు లేని పాఠశాలలకు భూసేకరణ
కలెక్టర్లతో సమావేశాలు, నియోజకవర్గాల్లోనే భవనాల ఏర్పాటు

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని మహాత్మా జ్యోతిబా పూలే బిసి సంక్షేమ గురుకుల విద్యాసంస్థలను ఈ ఏడాది ఆగస్టు 30వ తేదీ నాటికి పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను స్పష్టంగా ఆదేశించారు. విద్యార్థులకు అత్యుత్తమ నాణ్యమైన విద్యతో పాటు పూర్తి సురక్షితమైన వాతావరణం, మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వం యొక్క ప్రథమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. బిసి గురుకులాల నిర్వహణ, విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు మరియు విద్యార్థుల సంక్షేమంపై రీజినల్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్లు (ఆర్సీవోలు), ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమీక్షా సమావేశంలో మంత్రి ఈ మేరకు మాట్లాడారు. గురుకుల విద్యాసంస్థల రోజువారీ పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, విద్యార్థులకు ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలని మంత్రి అధికారులకు సూచించారు. అందులో భాగంగా ప్రతి రీజినల్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ (ఆర్‌సీవో) వారానికి కనీసం మూడు రోజులు మిగతా 2లో..



### ట్రాఫిక్ పోలీసులకు కొత్త నిబంధన.. డ్యూటీలో మొబైల్‌కు నో!

తెలంగాణ ట్రాఫిక్ పోలీసులకు షాక్..
విధుల్లో వ్యక్తిగత ఫోన్లపై ఆంక్షలు?
డ్యూటీలో మొబైల్ వాడకంపై కఠిన నిర్ణయం దిశగా తెలంగాణ పోలీసులు
రోడ్లపై పూర్తి అప్రమత్తతే లక్ష్యం.. ట్రాఫిక్ పోలీసులకు కొత్త రూల్
డ్యూటీలో మొబైల్ తీసుకెళ్లొద్దు.. ట్రాఫిక్ సిబ్బందికి కొత్త ప్రతిపాదన
ట్రాఫిక్ పోలీసుల విధుల్లో కీలక మార్పులు..
మొబైల్ ఫోన్లపై నిషేధం పరిశీలనలో
రోడ్డు భద్రతకు పెద్దపీట.. ట్రాఫిక్ పోలీసుల మొబైల్ వినియోగంపై ఆంక్షలు
డ్యూటీలో మొబైల్ చూస్తే కుదరదు..
తెలంగాణలో కొత్త నిబంధనకు ప్రతిపాదన
ప్రమాదాల నివారణే లక్ష్యం..
ట్రాఫిక్ పోలీసులకు మొబైల్ బ్యాన్?
విధి నిర్వహణలో నిర్లక్ష్యానికి చెక్..
ట్రాఫిక్ పోలీసుల ఫోన్లపై కొత్త రూల్స్

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ పోలీసుల విధి నిర్వహణలో కీలక మార్పులు తీసుకురావాలని ఉన్నతాధికారులు యోచిస్తున్నారు. రోడ్లపై విధుల్లో ఉండే ట్రాఫిక్ సిబ్బంది, అధికారులు ఇకపై మిగతా 3లో..



## 'ఎల్ నినో'పై సర్కార్ వ్యూహం

సాగు, తాగునీరు, విద్యుత్ రంగాలపై సమీక్ష
వేటిపైనా ప్రభావం పడకుండా ముందస్తు చర్యలు
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి
వాతావరణ మార్పులపై ముందస్తు చర్యలు
రవీంద్రభారతిలో ప్లానింగ్ శాఖ అవగాహన సదస్సు
కార్యక్రమానికి హాజరైన మంత్రి అజారుద్దీన్
గ్రామీణ స్థాయి వరకు చైతన్య కార్యక్రమాలు

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో చోటుచేసుకుంటున్న 'ఎల్ నినో' వంటి ప్రతికూల మార్పుల వల్ల తెలంగాణ రాష్ట్ర ప్రజలు, వివిధ రంగాలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం దూరదృష్టితో ముందస్తు వ్యూహాలు రూపొందిస్తోంది. ముఖ్యంగా వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై ఈ వాతావరణ ప్రభావం పడకుండా పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. సమస్య తీవ్రతను ముందే గ్రహించి ఎదుర్కొనేలా రాష్ట్ర యంత్రాంగాన్ని, సన్నద్ధం చేస్తున్నారు.
హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర ప్లానింగ్ శాఖ ఆధ్వర్యంలో "పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతల పెరుగుదల నుంచి మిగతా 2లో..



## సోనమ్ వాంగ్‌చుక్‌కు హైకోర్టులో ఊరట

మెదాంతా ఆస్పత్రికి తరలించేందుకు గ్రీన్ సిగ్నల్
భార్య గీతాంజలి అప్పీల్‌పై సంచలన తీర్పు
కేంద్రం అభ్యంతరం లేదనడంతో ఊరట
సఫ్దర్‌జంగ్ నుంచి మెదాంతాకు తరలింపున
ఎయిమ్స్ వైద్య బృందం, వ్యక్తిగత వైద్యుడితో చర్చలు
నిరంతర పర్యవేక్షణ అవసరమన్న నిపుణులు

ఢిల్లీ, (ప్రజాక్షేత్రం):

వివిధ పోటీ పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అవకతవకలకు వ్యతిరేకంగా నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌కు ఢిల్లీ హైకోర్టులో బిగ్ రిలీఫ్ లభించింది. ప్రస్తుతం సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను గురుగ్రామ్‌లోని మెదాంతా ప్రైవేట్ ఆస్పత్రికి తరలించేందుకు న్యాయస్థానం మిగతా 2లో..



## ఘనంగా బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం



పోటెత్తిన భక్తజనం..
భక్తుల సందడితో మార్మోగిన ఆలయం
సీఎం సతీమణి గీతతో పాటు ప్రజాప్రతినిధుల ప్రత్యేక పూజలు
తెల్లవారుజాము నుంచే దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు
జనసందోహంతో కిక్కిరిసిన ఆలయ పరిసరాలు
పోలీసుల కట్టుదిట్టమైన భద్రత.. విస్తృత ఏర్పాట్లు

02

# ఇది కాలం తెచ్చిన కరవు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరవు

మొదటిపేజీ తరువాయి

విద్యుత్, సమయానికి రైతుబంధు అందేవి. వ్యవసాయంలో పంజాబ్‌ను తలదన్నే రీతిలో తీర్చిదిద్దారు. కాళేశ్వరంతో కేసీఆర్‌కు పేరొస్తుందనే ఆ ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు ఒకరోజు నీరు లేవంటారు.. రెండో రోజు మరో కథ చెబుతారు. ఇది కాలం తెచ్చిన కరవు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరవు. సీఎం రేవంత్‌కు రెండే తెలుసు.. ఒకటి ఓట్లు.. రెండు తిట్లు. రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది'' అని కేటీఆర్ అన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెచ్చిన ధాన్యం 30 రోజులు, 60 రోజులైనా కొనేటోడు దిక్కు లేడు.. సంచులు ఇచ్చేటోడు దిక్కులేడు. ఈ దిక్కు దివానం లేని ప్రభుత్వంలో అన్నదాతకు దిక్కు లేని పరిస్థితి వస్తే ఆ పంటను కాపాడుకునే ఆ కొనుగోలు కేంద్రం దగ్గరే కాపు కాసి ఉన్నప్పుడు గోడ కూలి నలుగురు రైతులు చనిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పంట కొనక పోవడం వల్ల గోడ కూలి ప్రాణాలు కోల్పోయిన నలుగురు రైతుల కుటుంబాలకు కేటీఆర్ ఆర్థిక సాయం అందించారు. మే 6న లక్షెట్టిపేట మండలంలో పంటలు కాపాడుకునేందుకు వెళ్లి మృత్యువాత పడిన నలుగురు రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ. 5 లక్షల చొప్పున మొత్తం రూ. 20 లక్షల ఆర్థికసాయాన్ని అందించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. నలుగురు రైతులు చనిపోతే వారికి న్యాయం చేయాలని మా బీఆర్ఎస్ నాయకులు జీవన్ రెడ్డి, దివాకర్ రావు 8 గంటలు ధర్నా చేసినా.. దున్నపోతు మీద వాన పడ్డట్లు ప్రభుత్వం నుండి స్పందన రాలేదు. చివరికి ఏదో మొక్కుబడిగా ఒప్పుకున్నారు.. చూస్తాం.. చేస్తాం అని ఒప్పుకున్నరు.. కానీ ఈ రోజు వరకు దాదాపు 2 నెలలు గడిచిపోయినా స్పందన లేదు. కనీసం మానవత్వం అనే ఆలోచన కూడా లేదు. ఈ నలుగురు జీవితాలు అర్థాంతరంగా ముగిసిపోయిన తర్వాత నాకు దివాకర్‌రావు, జీవన్ రెడ్డి కలిసి ఫోన్ చేశారు. అన్నా పార్టీ తరపున మనమైనా ఏమన్నా చెప్పాలే.. ఎందుకంటే రైతులు ఇలా ఇబ్బంది పడుతున్నారు.. వారికి అండగా నిలబడాలన్నారు. ఆ రోజు మేం వరంగల్‌లో ఉన్నం.. రైతు సంగ్రామ సదస్సు నిర్వహిస్తున్నాం. అదే రోజు ఈ బాధాకరమైన సంఘటన జరిగింది. వెంటనే కేసీఆర్‌ను అడిగినం. మంచిర్యాల జిల్లాలో జరిగిన ఈ విషాదానికి పార్టీ తరపున తప్పకుండా మనం అండగా నిలబడదాం.. ఒక్కో రైతుకు రూ.5 లక్షలు వెంటనే ప్రకటించాలని కేసీఆర్ చెప్పారన్నారు.

**జరిగింది ఒక విషాదం..**

ఇవాళ శోకసంద్రంలో ఉన్న రైతు కుటుంబాలను నేను అడిగిన. ప్రభుత్వం నుంచి ఏమన్నా వచ్చిందా అమ్మా అని అడిగిన. రెండున్నర నెలలు అయిపోయింది.. మంచిర్యాలలో ఉన్నది కాంగ్రెస్ ఎమ్మెల్యే.. రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం. జరిగింది ఒక విషాదం.. ఏ రాజకీయ పరమైన హడావిడి లేదు.. ఏ ఆర్భాటం లేదు.. ఏ ఎన్నిక లేదు.. కానీ ప్రభుత్వం నుంచి స్పందన



లేదు. నలుగురితో మాట్లాడుతుంటే ఒక్కొక్కరిది ఒక్కో బాధ. వాళ్లందరు చెప్పింది ఒక్కటే మాట.. ఇవాళ నలుగురు రైతులు చనిపోతే ఒక్క రైతుకు మాత్రమే రూ.5 లక్షలు వచ్చింది. అది కూడా ఎక్కడిది.. కేసీఆర్ పెట్టిన రైతు బీమా నుంచి రూ.5 లక్షలు ఇచ్చారు. కానీ మిగిలిన ముగ్గురికి రూ.5 లక్షలు కాదు కదా.. రూ.5 వేలు కాదు.. 5 పైసలు కూడా ప్రభుత్వం నుంచి సహాయం అందలేదని కేటీఆర్ మండిపడ్డారు.



# ఘనంగా బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం

- **పోటెత్తిన భక్తజనం.. భక్తుల సందడితో మార్మోగిన ఆలయం**
- **సీఎం సతీమణి గీతతో పాటు ప్రజాప్రతినిధుల ప్రత్యేక పూజలు**
- **తెల్లవారుజాము నుంచే దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు**
- **జనసందోహంతో కిక్కిరిసిన ఆలయ పరిసరాలు**
- **పోలీసుల కట్టుదిట్టమైన భద్రత.. విస్తృత ఏర్పాట్లు**

**హైదరాబాద్‌లోని బల్కంపేట (ప్రజాక్షేత్రం):** ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం కల్యాణోత్సవం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో సందడిగా మారింది.

కల్యాణోత్సవంలో ముఖ్యమంత్రి సతీమణి గీత పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు కూడా వేడుకల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణంతో పాటు బల్కంపేట ప్రధాన రహదారులు, పరిసర వీధులు భక్తులతో కిక్కిరిసిపోయాయి.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. తాగునీరు, క్యూలైన్లు, ఇతర సౌకర్యాలను కల్పించగా, ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

# నీట్ లీక్ ఘోర పాపం మళ్లీ జరగొద్దు

మొదటిపేజీ తరువాయి

ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు.

మంగళవారం నిర్వహించిన 'మంగళ్ మిలన్' ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేసినట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. పరీక్షల లీకేజీలను అరికట్టడం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, అది దేశం మొత్తానికి సంబంధించిన జాతీయ బాధ్యత అని మోదీ పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సమావేశాలపైనా ప్రధాని కీలక వ్యాఖ్యలు చేశారు. అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ విభేదాలు ఉండటం సహజమేనని, అయితే దేశ భవిష్యత్తు, యువత సంక్షేమం వంటి అంశాల్లో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చలు జరిగేలా ప్రతిపక్షాలు సహకరించాలని కోరారు.

యువతను ఉద్దేశించి కూడా ప్రధాని కీలక సందేశం ఇచ్చారు. పిల్లలను, విద్యార్థులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయొద్దని, తప్పుడు మార్గంలోకి వెళ్లడం సులభమే అయినా తిరిగి సరైన దారిలోకి రావడం చాలా కష్టమని చెప్పారు. వారు సరైన దిశలో ముందుకు సాగేలా చూడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

దేశంలోని అత్యంత కీలక పోటీ పరీక్షల్లో ఒకటైన నీట్ పరీక్ష నిర్వహణపై ఈ ఏడాది తీవ్ర వివాదం నెలకొంది. మేలో నిర్వహించిన పరీక్షలో పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో దేశవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అనంతరం జూన్‌లో కొన్ని కేంద్రాల్లో మళ్లీ పరీక్ష నిర్వహించాల్సి వచ్చింది. ఇదే సమయంలో సీబీఎస్ఈ 12వ తరగతి ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానంలో లోపాలు వెలుగుచూడటంతో విద్యా వ్యవస్థపై మరింత విమర్శలు వచ్చాయి.

ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'చలో పార్లమెంట్' ఆందోళన తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వేలాది మంది నిరసనకారులు పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో ఢిల్లీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీ తొలిసారిగా నీట్ పేపర్ లీక్‌పై బహిరంగంగా స్పందించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# 'ఎల్ నినో'పై సర్కార్ వ్యూహం

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ సంసిద్ధత వరకు" అనే అంశంపై ఒక ప్రత్యేక రాష్ట్ర స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కేవలం పాలనాపరమైన ఉత్తర్వులు ఇవ్వడమే కాకుండా, ఎల్ నినో ప్రభావంపై క్షేత్రస్థాయిలో ప్రజల్లో అవగాహన పెంచడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం వ్యాఖ్యానించారు.

వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న భూమధ్యరేఖా పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల తెలంగాణలోని చెరువులు, వాగులు, గ్రామీణ ప్రాంతాల నీటి వనరులపై ఎలాంటి ప్రభావం పడుతుందో శాస్త్రవేత్తల ద్వారా ప్రభుత్వం అధ్యయనం చేయిస్తోంది. దీని ఆధారంగా వ్యక్తిగత, కుటుంబ, గ్రామ, మండల మరియు జిల్లా స్థాయిలో ఎవరికి వారు ముందస్తుగా సిద్ధమయ్యేలా కార్యాచరణను రూపొందిస్తున్నారు. సమస్యను ఎదుర్కోవడానికి ప్రజలను భాగస్వాముల్ని చేస్తూ చైతన్యం తెస్తున్నట్లు తెలిపారు.

ఒకవేళ వాతావరణ మార్పుల వల్ల వర్షాభావ పరిస్థితులు ఎదురైనా రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోంది. వ్యవసాయ నిపుణుల సూచనల ప్రకారం తక్కువ నీటితో, తక్కువ కాలంలో పండే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. ఈ సమాచారాన్ని నిరంతరం ప్రత్యక్ష ప్రసారాలు, మీడియా ద్వారా ప్రచారం చేస్తూ రైతాంగాన్ని సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో జీవన విధానానికి విద్యుత్ అత్యంత కీలకంగా మారిందని, ఎల్ నినో వల్ల పెరిగిన విద్యుత్ డిమాండ్‌ను సమర్థవంతంగా తట్టుకునేందుకు 'స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్' అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క వెల్లడించారు. పగటి పూట సమృద్ధిగా, తక్కువ ఖర్చుతో లభించే సౌర విద్యుత్‌ను (సోలార్ పవర్) గరిష్టంగా వాడుకోవడం వల్ల ప్రభుత్వం మరియు వినియోగదారులపై పడే ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. పగటి పూట సోలార్ వాడి, మిగిలిన సమయాల్లో థర్మల్ విద్యుత్‌ను సమతుల్యంగా వాడుతూ విద్యుత్ గ్రిడ్ స్థిరత్వాన్ని కాపాడుతున్నట్లు చెప్పారు. వాతావరణంలో మార్పులు మరియు ఉష్ణోగ్రతలు పెరగడంతో పగలు, రాత్రి తేడా లేకుండా ఫ్యాన్లు, ఏసీలు, బోర్లకు ఉపయోగించే మోటార్లు మరియు లిఫ్ట్ ఇరిగేషన్ పంపింగ్ వాడకం గణనీయంగా పెరిగిందని ప్రభుత్వం గుర్తించింది. సాధారణంగా వర్షాకాలంలో విద్యుత్ డిమాండ్ తక్కువగా ఉంటుంది. కానీ, ఎల్ నినో ప్రభావంతో ప్రస్తుతం తెలంగాణలో నమోదవుతున్న డిమాండ్ వేసవి కాలం (ఏప్రిల్) నాటి గరిష్ట స్థాయికి చేరింది. ఈ రకమైన ఊహించని డిమాండ్‌ను తట్టుకునేలా ముందస్తుగా సమర్థవంతమైన ఎనర్జీ ప్లానింగ్ పూర్తి చేసినట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వం కేవలం ప్రజల తాగునీరు, వ్యవసాయ సాగునీటి అవసరాలకే పరిమితం కాకుండా సమగ్ర ఆలోచనతో అడుగులు వేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పశువులు, పక్షులతో పాటు అడవుల్లో ఉండే జంతువుల నీటి, ఆహార అవసరాలకు కూడా ఎటువంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అన్ని జీవరాశుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వివిధ శాఖలను సమన్వయం చేస్తూ ప్రణాళికా బోర్డు ఈ వివరాలను సిద్ధం చేసింది.

సమాజంలో వాతావరణ మార్పులపై చైతన్యం తీసుకురావడానికి విషయ నిపుణులతో ఈ సమావేశాన్ని విజయవంతంగా ఏర్పాటు చేసిన ప్లానింగ్ శాఖను డిప్యూటీ సీఎం అభినందించారు. వ్యవసాయ, విద్యుత్, సాగునీటి, భూగర్భ జల శాఖలను సమన్వయం చేసి పనిచేయడాన్ని కొనియాడారు. భవిష్యత్తులో ఇటువంటి అవగాహన సదస్సులను అన్ని జిల్లాల్లో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, ఐఏఎస్ అధికారులు దివ్య దేవరాజన్, గోపి, జితేష్ వి పాటిల్, ప్లానింగ్ డైరెక్టర్ రూఫాస్ దత్తం తదితరులు పాల్గొన్నారు.

# ఒట్ల మీద ఉన్న శ్రద్ధ.. నీటి బొట్ల మీద పెట్టు..

మొదటిపేజీ తరువాయి

నుంచి 105 టీఎంసీల నీరు కిందకు పోయిందని తెలిపారు. నీళ్లన్నీ ఆంధ్రాకు తరలిపోయాయని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం 1.9 టీఎంసీలు మాత్రమే ఎత్తిందని చెప్పారు. నాలుగు రోజులకు ఒక టీఎంసీ ఎత్తవచ్చని.. 50 రోజులకు 12 టీఎంసీలు ఎత్తే అవకాశం ఉందని తెలిపారు. కానీ కనీసం రెండు టీఎంసీలు కూడా ఎత్తలేదని విమర్శించారు. ఇది నేరపూరిత నిర్లక్ష్యం కాదా అని ప్రశ్నించారు. నీ ప్రభుత్వానికి ఏం శిక్ష వేయాలో నువ్వే చెప్పు అని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. ఇన్ని నీళ్లు ఉంటే ఎత్తవా అని మండిపడ్డారు. ఇదేనా రైతులపై నీకు ఉన్న చిత్తశుద్ధి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న దేవాదులను నిర్వహించే సత్తా మీకు లేదా అని అడిగారు. మీ వైఫల్యం వల్ల వరంగల్ జిల్లా వ్యవసాయ సంక్షోభంలో మునిగిపోయిందని అన్నారు. వరంగల్, కరీంనగర్ జిల్లాలు ఆగమయ్యే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కార్ వైఫల్యమే అని ఆరోపించారు.

22 రిజర్వాయర్ల కెపాసిటీ 12 టీఎంసీలు అని.. ప్రతిరోజు పావు టీఎంసీ ఎత్తవచ్చని తెలిపారు. అంటే ఇప్పటికి 12 టీఎంసీలు ఎత్తిపోయవచ్చని పేర్కొన్నారు. మరెందుకు 22 రిజర్వాయర్లు నింపలేదని ప్రశ్నించారు. దేవాదుల నుంచి 105 టీఎంసీలు కిందకు తరలిపోయాయని తెలిపారు. ఈ రోజు కూడా దేవాదులలో 78 మీటర్ల ఎత్తులో నది ప్రవహిస్తున్నదని పేర్కొన్నారు. 73 మీటర్లు ఉంటే చాలు మోటార్లు నడుస్తాయని.. 78 మీటర్లు ఉన్నప్పటికీ మోటార్లు నడిపించడం లేదని చెప్పారు. ఎందుకు నీళ్లు ఎత్తిపోయడం లేదని, ఏమిటీ నిర్లక్ష్యమని ప్రశ్నించారు. అతి తక్కువ వర్షపాతం పడిన జిల్లా వరంగల్ జిల్లా అని హరీశ్‌రావు తెలిపారు. రెయిన్‌ఫాల్ తక్కువ ఉంటే సమ్మక్క బ్యారేజీ నుంచి నీళ్లు ఎత్తడం లేదని పేర్కొన్నారు. ఎందుకు నీళ్లను కిందకు జారవిడుస్తున్నారని ప్రశ్నించారు. మేం ప్రెస్‌మీట్ పెట్టగానే.. దేవాదులలో రెండు మోటార్లు స్టార్ట్ చేశారని తెలిపారు. మేం ప్రశ్నిస్తే తప్ప నీళ్లు ఎత్తిపోయారా అని నిలదీశారు.

# గురుకులాల తనిఖీలకు డెడ్‌లైన్

మొదటిపేజీ తరువాయి

క్షేత్రస్థాయిలో పర్యటించాలని, ప్రతి వారమూ కనీసం ఆరు గురుకుల విద్యాసంస్థలను స్వయంగా సందర్శించి పరిశీలించాలని ఆదేశించారు. ఆర్‌సీవోలు కేవలం కార్యాలయ పర్యవేక్షణకే పరిమితం కాకూడదని, ప్రధాన కార్యాలయానికి, జిల్లా యంత్రాంగానికి మరియు పాఠశాలల నిర్వహణకు మధ్య ఒక బలమైన సంధానకర్తలుగా వ్యవహరిస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకుల విద్యాసంస్థలకు వెంటనే భూముల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. దీనికోసం ఆయా జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేకంగా సమావేశమై అవసరమైన స్థలాలను సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏ నియోజకవర్గానికి మంజూరైన గురుకుల పాఠశాల అదే నియోజకవర్గ పరిధిలోనే కొనసాగేలా, అక్కడ సొంత భవనాలు నిర్మించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇక అద్దె భవనాల్లో నడుస్తున్న విద్యాసంస్థలకు ప్రభుత్వం చెల్లించే మొత్తం అద్దెలో కనీసం 6 శాతం నిధులను ఆయా భవనాల మరమ్మతులు, పారిశుధ్య పనుల కోసం తప్పనిసరిగా కేటాయించాలని ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని ఏ గురుకులంలోనూ ఆహారం వికటించి (ఫుడ్ పాయిజనింగ్) విద్యార్థులు అస్వస్థతకు గురయ్యే ఘటనలు పునరావృతం కాకూడదని మంత్రి హెచ్చరించారు. వంటశాలల పరిశుభ్రత, మెస్ నిబంధనలు, నిత్యావసరాల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థులు శారీరకంగానే కాకుండా మానసిక ఆరోగ్యంతో ఉండటానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఒత్తిడికి లోనుకాకుండా ఉండేందుకు నిపుణులైన సైకాలజిస్టులతో పాఠశాలల్లో ప్రత్యేక అవగాహన సమావేశాలు, కౌన్సిలింగ్ ప్రోగ్రామ్‌లు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

రాబోయే కాలంలో నీటి కొరత ఏర్పడకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తగా ప్రతి గురుకుల విద్యాసంస్థ ప్రాంగణంలో రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ (వర్షపు నీటి ఇంకుడు గుంతల) వ్యవస్థలను సమర్థవంతంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, వారి చేత పెద్ద ఎత్తున మొక్కలు నాటించాలని, ఆ నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను కూడా విద్యార్థులకే అప్పగించి వారిలో బాధ్యతాయుత ప్రవర్తనను పెంపొందించాలని సూచించారు. భవనాల మరమ్మతుల నిధులను సకాలంలో ఉపయోగిస్తూ విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు.

గురుకులాల నిర్వహణపై క్షేత్రస్థాయిలో కచ్చితమైన సమాచారం తెలుసుకునేందుకు ప్రతి నెల కనీసం 15 గురుకుల విద్యాసంస్థలను తాను స్వయంగా, అలాగే శాఖ కమిషనర్, కార్యదర్శి కలసి అకస్మిక తనిఖీలు (సర్ ప్రైజ్ విజిట్స్) చేస్తామని మంత్రి ప్రకటించారు. విద్యార్థుల వసతి, భోజనం, విద్యా ప్రమాణాల విషయంలో అధికారులు లేదా ఉపాధ్యాయులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం సహించేది లేదని ఘాటుగా హెచ్చరించారు. తల్లిదండ్రుల నుంచి వచ్చే ఫిర్యాదులు, సూచనలపై తక్షణమే స్పందించి పరిష్కరించేలా ఒక ప్రత్యేక వ్యవస్థ ఉండాలన్నారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా క్రీడలు, లలిత కళలు, నాటకం, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాల్లోనూ ప్రత్యేక ప్రోత్సాహం అందించాలని మంత్రి కోరారు. క్రీడలు, ఇతర రంగాల్లో విశేష ప్రతిభ చూపించే విద్యార్థుల వివరాలను ప్రధాన కార్యాలయానికి పంపితే, వారికి ప్రభుత్వం తరపున మరింత ఆర్థిక, నైతిక ప్రోత్సాహాన్ని అందిస్తామన్నారు. ఇదే సమయంలో మూసీ గురుకుల విద్యాసంస్థకు త్వరలోనే సొంత భవన నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి వెల్లడించారు. ఈ ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయాదేవి, కార్యదర్శి బడుగు సైదులు, విభాగాధిపతులు, డిప్యూటీ సెక్రటరీలు మరియు వివిధ జిల్లాల రీజినల్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్లు (ఆర్‌సీవోలు) ప్రత్యక్షంగా పాల్గొన్నారు. అధికారులు క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకుని, అట్టడుగు స్థాయి విద్యార్థులకు సంక్షేమ ఫలితాలు అందేలా నిరంతరం కృషి చేయాలని మంత్రి ఈ సందర్భంగా ఆదేశించారు.

# సోనమ్ వాంగ్‌చుక్‌కు హైకోర్టులో ఊరట

మొదటిపేజీ తరువాయి

మంగళవారం అనుమతి ఇచ్చింది. వాంగ్‌చుక్‌ను ఆయనకు నచ్చిన ప్రైవేట్ ఆస్పత్రికి తరలించేందుకు నిరాకరిస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆయన భార్య గీతాంజలి ఆంగ్మో ఢిల్లీ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం విచారణ చేపట్టిన జస్టిస్ డీకే ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కారియా ధర్మాసనం ఆయనను తక్షణమే మెదాంతా ఆస్పత్రికి తరలించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

విచారణ సందర్భంగా సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్న ఎయిమ్స్ వైద్య బృందంతో పాటు, ఆయన వ్యక్తిగత వైద్యుడితో కూడా హైకోర్టు ధర్మాసనం వివరంగా మాట్లాడింది. వాంగ్‌చుక్ ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఆయనకు నిరంతర వైద్య పర్యవేక్షణ అత్యంత అవసరమనే విషయంలో అందరి వైద్యుల అభిప్రాయం ఒక్కటిగానే ఉందని కోర్టు పేర్కొంది. ఈ వైద్య నివేదికలను పరిశీలించిన అనంతరం, ప్రభుత్వ ఆస్పత్రిలో తన ఆరోగ్య పరిస్థితి మరియు వసతులపై వాంగ్‌చుక్ వ్యక్తం చేసిన సందేహాలను, ఆందోళనలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతూ ధర్మాసనం మధ్యాహ్నం ఈ కీలక ఉత్తర్వులు ఇచ్చింది. వాంగ్‌చుక్ తరపున కోర్టులో హాజరైన సీనియర్ న్యాయవాది అఖిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ.. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి స్థిరంగానే ఉందని వెల్లడించారు. నిరాహార దీక్షను కొనసాగిస్తున్నప్పటికీ ఆయన నోటి ద్వారా ద్రవపదార్థాలను (ఫ్రూట్ జ్యూస్‌లు, నీళ్లు) తీసుకుంటున్నారని తెలిపారు. అయితే, ఆస్పత్రిలో ఆయనపై నిరంతరం పోలీసు నిఘా ఉంచుతున్నారని, కనీసం మొబైల్ ఫోన్ ఉపయోగించేందుకు కూడా అనుమతి ఇవ్వడం లేదని వాంగ్‌చుక్ రాసిన లేఖను కోర్టు ముందుంచారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, మెదాంతా ఆస్పత్రికి తరలిస్తే ఈ సమస్యలన్నీ పరిష్కారమవుతాయా అని ప్రశ్నించగా, ఖచ్చితంగా పరిష్కారమవుతాయని అఖిల్ సిబల్ స్పష్టం చేశారు.

ఈ కేసు విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కీలక వ్యాఖ్యలు చేశారు. సోనమ్ వాంగ్‌చుక్‌ను సఫ్దర్‌జంగ్ నుంచి గురుగ్రామ్‌లోని మెదాంతా ఆస్పత్రికి తరలించడంపై ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని ధర్మాసనానికి తెలిపారు. మెదాంతా అనేది అత్యంత పేరొందిన, అత్యాధునిక వైద్య సదుపాయాలు ఉన్న ఆస్పత్రి అని, అక్కడ ఆయన చికిత్స పొందేందుకు ప్రభుత్వం ఎంతమాత్రం అడ్డుచెప్పదని వివరించారు. కేంద్రం ధోరణి సానుకూలంగా ఉండటంతో హైకోర్టు ఈ నిర్ణయాన్ని తీసుకుంది.

అదే సమయంలో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టు ముందు ఒక ముందస్తు షరతును ఉంచారు. మెదాంతాలో చేరుస్తున్నందున, అక్కడ చికిత్స అందిస్తున్న వైద్యుల సలహాకు విరుద్ధంగా ఆయన ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ కోరకూడదని స్పష్టం చేశారు. దీనికి హైకోర్టు ధర్మాసనం అంగీకరించింది. వాంగ్‌చుక్‌ను తక్షణమే మెదాంతా ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేయాలని సూచించింది. అలాగే ఇప్పటివరకు సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో ఆయనకు నిర్వహించిన అన్ని వైద్య పరీక్షల నివేదికలు, ఆరోగ్య రికార్డులను మెదాంతా ఆస్పత్రి వైద్య బృందానికి తక్షణమే అందజేయాలని ఆదేశించింది. ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి ఆంగ్మో పూర్తిస్థాయిలో స్వాగతించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో వాంగ్‌చుక్‌కు అందించిన చికిత్స కంటే ఆయనను ఒక రకమైన నిర్బంధంలో ఉంచినట్లే అనిపించిందని సంచలన ఆరోపణలు చేశారు. నిజానికి ఆయన ఆరోగ్య పరిస్థితి ఏమీ ప్రాణాపాయ స్థితిలో లేదని, జంతర్‌మంతర్ నిరసన శిబిరం వద్దే వైద్యులు ఆయనను పర్యవేక్షించే అవకాశం ఉన్నప్పటికీ బలవంతంగా ఆస్పత్రికి తరలించారని విమర్శించారు. ఏదేమైనా కోర్టు ఉత్తర్వుల ప్రతి కాపీ అందగానే ఆయనను మెదాంతాకు మారుస్తామని చెప్పారు.

మరోవైపు పరీక్షల అక్రమాలపై సిటిజన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ (సీజేపీ) ఆధ్వర్యంలో చేపట్టిన 'సంసద్ చలో' ముట్టడి తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ క్రమంలో చోటుచేసుకున్న హింస, విధ్వంస ఘటనలపై ఢిల్లీ పోలీసులు తీవ్రస్థాయిలో చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు ఈ ఘర్షణలకు సంబంధించి నాలుగు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయగా, లభించిన ఆధారాలను బట్టి మరిన్ని కేసులు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విధ్వంసం వెనుక ఒక పక్కా వ్యూహం, ప్రణాళిక ఉన్నట్లు కీలక ఆధారాలు లభించాయని ఢిల్లీ పోలీసు అధికారులు వెల్లడించారు. సోమవారం నాటి ముట్టడి సమయంలో చోటుచేసుకున్న రాళ్ల దాడి మరియు ఘర్షణల్లో సుమారు 118 మందికి పైగా పోలీసు సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారని, 20కి పైగా ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలు ధ్వంసమయ్యాయని పోలీసులు తెలిపారు. పార్లమెంట్ స్ట్రీట్, కన్నాట్ ప్లేస్ స్టేషన్లలో భారతీయ న్యాయ సంహిత, ఆయుధ చట్టం, ప్రజా ఆస్తుల విధ్వంస నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజీలు, డ్రోన్ విజువల్స్ ఆధారంగా రాళ్ల దాడికి పాల్పడిన అల్లరి మూకలను గుర్తిస్తున్నారు. అనుమతి లేకుండా డ్రోన్లు ఎగరవేసిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటుండగా, జంతర్మంతర్ వద్ద తమ నిరసన శాంతియుతంగా కొనసాగుతుందని సీజేపీ ప్రకటించింది.

# శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ లో కొత్త సారధి బొల్లారం వెంకటరెడ్డి

- చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్యను మర్యాదపూర్వకంగా కలిసిన మండల అధ్యక్షుడు

**శంకర్‌పల్లి జులై 21(ప్రజాక్షేత్రం):** కాంగ్రెస్ పార్టీ సంస్థాగత వ్యవస్థను మరింత పటిష్టం చేసే దిశగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. నియామకాల ప్రకారం... శంకర్‌పల్లి మండలాధ్యక్షుడిగా బొల్లారం వెంకటరెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మంగళవారం చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్యను మర్యాదపూర్వకంగా కలిసి, పార్టీ అధ్యక్షుడిగా నియమించి నందుకు గాను కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వెంకటరెడ్డి మాట్లాడుతూ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మార్చడం, గ్రామస్థాయి నుంచి కార్యకర్తలకు సమన్వయం కల్పించడం, ప్రజా సమస్యలపై పార్టీ స్వరాన్ని మరింత బలంగా వినిపిస్తానని హామీ ఇచ్చారు. పార్టీని గ్రామ స్థాయి నుండి మండల స్థాయి వరకు మరింత బలోపేతం చేసి ప్రతి కార్యకర్తను కలుపుకొని ముందుకు సాగుతానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు గ్రామ సర్పంచ్ బండ లక్ష్మి నర్సింహా, ఉప సర్పంచ్ కావేలి గోవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ పోలీసులకు కొత్త నిబంధన.. డ్యూటీలో మొబైల్‌కు నో!

మొదటిపేజీ తరువాయి

డ్యూటీ సమయంలో వ్యక్తిగత మొబైల్ ఫోన్లను వెంట తీసుకెళ్లకుండా కొత్త నిబంధన తీసుకురావాలనే ప్రతిపాదన పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఇటీవలి కాలంలో కొంతమంది ట్రాఫిక్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్న సమయంలో మొబైల్ ఫోన్లు చూస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఘటనలను ఉన్నతాధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. డ్యూటీలో ఉండగా మొబైల్‌పై దృష్టి పెట్టడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగినా వెంటనే స్పందించే అవకాశం తగ్గిపోతుందని అధికారులు భావిస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో ట్రాఫిక్ సిబ్బంది పూర్తిగా అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నివారించే అవకాశం ఎక్కువగా ఉంటుందని విశ్లేషిస్తున్నారు.

ఈ నేపథ్యంలో విధి నిర్వహణ సమయంలో మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించి, అధికారిక సమాచార మార్పిడి కోసం కేవలం వీహెచ్ (VHF) సెట్ల ద్వారానే కమ్యూనికేషన్ నిర్వహించే విధానాన్ని అమలు చేయాలని అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో వీహెచ్ సెట్ల సిగ్నల్ సామర్థ్యాన్ని టెక్నాలజీ బృందాలు పరీక్షిస్తున్నాయి. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే రోడ్లపై విధులు నిర్వహించే ప్రతి ట్రాఫిక్ సిబ్బందికి వీహెచ్ సెట్ తప్పనిసరిగా అందించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ నిర్ణయానికి సంబంధించిన సాధ్యాసాధ్యాలపై ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహిస్తున్నారు. తుది ఆమోదం లభించిన తర్వాత కొత్త నిబంధనలను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఈ చర్యలతో ట్రాఫిక్ సిబ్బంది మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించే సామర్థ్యం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. దీంతో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ



మరింత సమర్థవంతంగా మారే అవకాశం ఉంది. కాగా, విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ పోలీసులు మొబైల్ ఫోన్లు వాడుతున్న ఘటనలు చాలా ఉన్నాయంటూ పోలీసు అధికారులకు ఫిర్యాదులు వెల్లాయట.. మరోవైపు.. కొందరు పోలీసులు.. తమ మొబైల్ కెమెరాల్లోనే.. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినవారి ఫొటోలను తీస్తున్న ఘటనలు కూడా లేకపోలేదు.. అయితే, ఈ రూల్స్‌పై ట్రాఫిక్ పోలీసులు ఎలా స్పందిస్తారు అనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది..

# రోడ్డు దాటుతుండగా విషాదం.. రెండు వాహనాల మధ్య మహిళ మృతి

**కీసర, జూలై 21(ప్రజా క్షేత్రం):** మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలోని కీసరలో రోడ్డు దాటుతున్న మహిళను తొలుత డీసీఎం వాహనం ఢీకొట్టగా, ఆమె రోడ్డుపై పడిపోవడంతో వెనుక నుంచి వస్తున్న కారు ఆమెపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ మసాబ్‌ట్యాంక్‌కు చెందిన ఆరుమాల లక్ష్మి (60) గత కొంతకాలంగా కీసరలో తన కుమార్తె పుష్పలత వద్ద ఉంటున్నారు. మంగళవారం ఉదయం కుమార్తెను విధులకు పంపేందుకు బస్‌స్టాప్‌కు వెళ్లిన లక్ష్మి, తిరిగి ఇంటికి వస్తూ కీసర హోండా షోరూమ్ సమీపంలో రోడ్డు దాటుతున్నారు. ఈ సమయంలో నాగారం వైపు నుంచి వచ్చిన డీసీఎం (ఏపీ 29 టీబీ 4271)



అతివేగంగా ఢీకొట్టడంతో ఆమె రోడ్డుపై పడిపోయారు. వెంటనే వెనుక నుంచి వస్తున్న కారు (టీజీ 08 డబ్ల్యూ 1164) ఆమెపైకి వెళ్లడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు. మృతురాలి కుమారుడు ఆరుమాల రంగనాథ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, డీసీఎం, కారు డ్రైవర్ల నిర్లక్ష్యంపై దర్యాప్తు చేపట్టారు.

# చెరువుల అభివృద్ధిపై హైడ్రాతో ప్రభాకర్ చర్చ

**ఉప్పల్, జూలై 21(ప్రజా క్షేత్రం):** మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలోని ఉప్పల్ నియోజకవర్గంలోని చెరువుల పరిరక్షణ, అభివృద్ధి పనులపై మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో సమావేశమై పలు సూచనలు చేశారు. ఇటీవల హైడ్రా చేపట్టిన ఉప్పల్ నల్లచెరువు, రామంతపూర్ పెద్ద చెరువు, హెచ్ఎంటీ నగర్ చెరువు, కాప్రా చెరువుల అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు.

చెరువుల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, పూర్తి స్థాయిలో సరిహద్దులను పరిరక్షించడం, ప్రభావిత భూ యజమానులకు టీడీఆర్ కేటాయింపులు, గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలకు పునరావాసం కల్పించడం, చెరువుల సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని ప్రభాకర్ సూచించారు. మాజీ ఎమ్మెల్యేగా, ఇంజనీర్‌గా చేసిన ఈ సూచనలను కమిషనర్ రంగనాథ్ స్వాగతించి అమలుకు పరిశీలిస్తామని తెలిపినట్లు సమాచారం.


ఈ సందర్భంగా రామంతపూర్ చిన్న చెరువు, నాచారం ఎర్రగుంట చెరువుల అభివృద్ధి పనులను కూడా త్వరలో ప్రారంభించనున్నట్లు హైడ్రా కమిషనర్ వెల్లడించినట్లు ప్రభాకర్ తెలిపారు. అలాగే చెరువుల్లోకి మురుగునీరు చేరకుండా ఉండేందుకు చెరువుల అప్‌స్ట్రీమ్ ప్రాంతాల్లోనే ఎస్టీపీల (సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు) నిర్మాణం చేపట్టాలని కమిషనర్‌ను ప్రభాకర్ కోరారు.



# ఆనెగుంట సర్పంచ్ కు షోకాజ్ నోటీసులు జారీ చేసిన జిల్లా పంచాయితీ అధికారి

**జహీరాబాద్ జూలై 21 (ప్రజాక్షేత్రం):** ఆనెగుంట గ్రామ సర్పంచ్ పొగాకు నరేష్ కుమార్ కు జిల్లా పంచాయితీ అధికారి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

గతంలో పని చేసిన సిసి రోడ్డు పెండింగ్ బిల్లుల గురించి జహీరాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ జిల్లా కలెక్టర్ కి డిపిఓ ,డిఎల్పిఓ,ఎంపీడీఓ , ఎంపీఓ కు పలు మార్లు పిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన అధికారులు 20232024 వ ఆర్థిక సంవత్సరంలో జీ పి డి పి ప్రణాళిక కింద చేపట్టిన సిసి రోడ్డు పనులకు సంబంధించిన రూ .773604/ రూపాయలు (ఏడు లక్షల డెబ్బై మూడు వేయిల ఆరు వందల నాలుగు మాత్రమే ) బిల్లులు పెండింగ్ లో ఉన్నట్లు విచారణ లో తేలినట్లు పనులు పూర్తయినప్పటికీ బిల్లుల చెల్లింపులు జరపడానికి గ్రామ సర్పంచ్ చర్యలు తీసుకోలేదని సర్పంచుపై ఎందుకు చర్యలు తీసుకొనరాదో 7 రోజులలో మీ యొక్క సంజాయిషీని డిపిఓ కార్యాలయం లో సమర్పించాలని లేఖలో పేర్కొన్నారు.







# ఒక గోదాం..భారీ నిల్వలు.. జీఎస్టీ–ఎస్‌వోటీ దాడితో కలకలం

- తెలంగాణలో అమ్మొద్దు.. షాపూర్‌నగర్‌లో మాత్రం అమ్మేశారు..!
- పన్నుల ఎగవేత అనుమానాలు..25 టన్నుల గోధుమ పిండి స్వాధీనం

**కుత్బుల్లాపూర్,జూలై 21 (ప్రజాక్షేత్రం):** తెలంగాణలో విక్రయానికి అనుమతి లేని ఉత్పత్తులను రహస్యంగా నిల్వ చేసి అధిక లాభాల కోసం విక్రయిస్తున్నారనే సమాచారంతో జీఎస్టీ అధికారులు, కుత్బుల్లాపూర్ స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్ఓటి) పోలీసులు సంయుక్తంగా షాపూర్‌నగర్ మార్కెట్‌లోని కమల్ సేల్స్ కార్పొరేషన్ గోదాంపై ఆకస్మిక దాడులు నిర్వహించారు.




దాడుల్లో నాట్ ఫర్ సేల్ ఇన్ తెలంగాణ అని స్పష్టంగా ముద్రించిన ఆశీర్వాద్ ఆటా, గోధుమ పిండి భారీగా నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. తెలంగాణలో విక్రయించరాదని తెలిసినా, అధిక లాభాల కోసం నిబంధనలను ఉల్లంఘిస్తూ విక్రయాలు చేస్తున్నారని అధికారులు అనుమానిస్తున్నారు.

ఈ దాడుల్లో సుమారు 25 టన్నుల గోధుమ పిండిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంతో రాష్ట్ర ప్రభుత్వానికి జీఎస్టీ ఆదాయంలో నష్టం కలిగే అవకాశం ఉందని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు. సరుకు రాష్ట్రంలోకి ఎలా వచ్చింది? ఎవరి ద్వారా సరఫరా జరిగింది? పన్ను ఎగవేత జరిగిందా? అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది. స్వాధీనం చేసుకున్న సరుకును అధికారుల ఆధీనంలోకి తీసుకుని, సంబంధిత పత్రాలను పరిశీలిస్తున్నారు. ఈ ఘటనపై జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



## జల్సాల కోసం అప్పులు..చివరికి ఉరివేసుకున్న ఇంజినీరింగ్ విద్యార్థి

- అప్పుల బాధతో బీటెక్ విద్యార్థి ఆత్మహత్య
- యువకుడి ప్రాణం తీసిన అప్పుల భయం

**కుత్బుల్లాపూర్,జూలై 21 (ప్రజాక్షేత్రం):** కొంపల్లిలో బీటెక్ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.

పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన మేకల శివకుమార్ (21) మైసమ్మగూడలోని నరసింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. ప్రస్తుతం కొంపల్లి దేవేందర్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు.

శివకుమార్ జల్సాలకు అలవాటు పడి స్నేహితులు, పరిచయస్తుల వద్ద డబ్బులు అప్పుగా తీసుకున్నట్లు తెలిసింది. ఇటీవల అప్పిచ్చిన వారు డబ్బులు తిరిగి ఇవ్వాలని



ఒత్తిడి చేయడంతో తీవ్ర ఆందోళనకు గురైనట్లు సమాచారం. ఇంట్లో తల్లిదండ్రులను డబ్బులు అడిగితే మందలిస్తారనే భయంతో తీవ్ర మనస్తాపానికి లోనైన శివకుమార్, తన గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సమాచారం అందుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

# తండ్రి మరణం తర్వాత తీవ్ర మనోవేదన..యువకుడి ఆత్మహత్య

- కొంపల్లిలో యోగా శిక్షకుడు బలవన్మరణం
- మానసిక ఒత్తిడే కారణమా?.. యువకుడి మృతిపై పోలీసుల దర్యాప్తు

**కుత్బుల్లాపూర్,జూలై 21 (ప్రజాక్షేత్రం):** పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంపల్లి స్వేత ఆర్యన్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న ఓ యోగా శిక్షకుడు ఉరివేసుకుని మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుజ్జుల నరేష్ (31), తండ్రి శంకరయ్య, కొంపల్లిలోని స్వేత ఆర్యన్ అపార్ట్‌మెంట్‌లో అద్దె ఇంటిలో ఉంటూ యోగా శిక్షకుడిగా పనిచేస్తున్నాడు. గత వారం రోజులుగా నరేష్ ఫోన్‌కు స్పందించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఈ క్రమంలో సోమవారం (జూలై 20) నరేష్ తల్లి గుజ్జుల లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు అపార్ట్‌మెంట్‌కు వెళ్లి చూడగా, గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్న స్థితిలో నరేష్ కనిపించాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.



సంఘటనా స్థలానికి చేరుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక విచారణలో నరేష్ కొంతకాలంగా తీవ్ర మానసిక ఒత్తిడి, డిప్రెషన్‌తో బాధపడుతున్నట్లు తెలిసింది. గత ఏడాది తండ్రి మరణం తర్వాత మరింత మానసికంగా కుంగిపోయి జీవితం పట్ల విరక్తి చెందడంతో ఈ దారుణ నిర్ణయం తీసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# కంపోస్టు షెడ్ కు భూమి పూజ చేసిన ఎంపీడీవో

- పాల్గొన్న సర్పంచ్ గైని వీరమణి అర్జున్

**కోటగిరి,జులై 21(ప్రజాక్షేత్రం):** మండలంలోని ఎత్తొండ క్యాంపు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కంపోస్టు షెడ్డు కు కోటగిరి ఎంపీడీవో విష్ణు మంగళవారం భూమి పూజ చేశారు. స్థానిక సర్పంచ్ గైని వీరమణి అర్జున్ తో కలిసి ఈ భూమి పూజలో పాల్గొన్న ఎంపీడీవో విష్ణు షెడ్డు నిర్మాణాన్ని తొందరగా పూర్తిచేయాలని సూచించారు. షెడ్డును నాణ్యతతో నిర్మించాలని కోరారు.కొత్తగా ఏర్పడ్డ గ్రామపంచాయతీలో కంపోస్టు షెడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో కంపోస్ట్ షెడ్ల వినియోగం పూర్తిస్థాయిలో జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిపి సెక్రెటరీ ఉదయ్ భాస్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జీడిమెట్లలో విషాదం..డిప్రెషన్‌తో ఉరివేసుకుని ఆత్మహత్య

**కుత్బుల్లాపూర్,జూలై 21 (ప్రజాక్షేత్రం):** జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో కుటుంబ కలహాలు మరో విషాదానికి దారితీశాయి. భార్యతో విభేదాల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా కలకలం రేపింది.

పోలీసుల కథనం ప్రకారం.. రామోజు దక్షిణమూర్తి కుమారుడు రామోజు చందు (34) 2017లో సంధ్యను వివాహం చేసుకున్నాడు. వివాహానంతరం గాంధీనగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, అయితే కొంతకాలంగా భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తడంతో సంధ్య తన పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ ఘటనతో చందు తీవ్ర మనోవేదనకు గురై డిప్రెషన్‌లోకి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఈ నెల 20వ తేదీ సాయంత్రం సుమారు 5:20 గంటల సమయంలో చందు తన నివాసంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చే



సుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా, ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి రామోజు దక్షిణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన జీడిమెట్ల పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు గల ఖచ్చితమైన కారణాలపై విచారణ కొనసాగుతోంది.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

- **సిపిఐ సీనియర్ నేత మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి**
- **విద్యార్థులపై బలప్రయోగాన్ని సీపీఐ ఖండన**
- **ఎల్ఎండీకి వెంటనే నీరు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి**

**కరీంనగర్,జూలై 21 (ప్రజాక్షేత్రం):**

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం లాఠీచార్జీ చేయడం అమానుషమని సీపీఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి విమర్శించారు. లీకేజీ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

కరీంనగర్‌లోని సీపీఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్ పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందన్నారు. ఈ అంశంపై ఢిల్లీలో విద్యార్థులు, తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్లు చేపట్టిన నిరసనపై లాఠీచార్జీ, భాష్పవాయు ప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. ఉద్యమాలను అణచి వేయాలని చూస్తే అవి మరింత ఉధృతమవుతాయని పేర్కొన్నారు.

నైతిక విలువలు, రామరాజ్యం గురించి మాట్లాడే ప్రధాని నరేంద్ర మోదీ వాటిని ఆచరణలో ఎందుకు చూపడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులపై బలప్రయోగాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

**గోదావరి జలాల వినియోగంపై దృష్టి పెట్టాలి**

తెలంగాణ మెట్ట ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించేందుకు గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగించాల్సిన అవసరం ఉందని చాడ వెంకటరెడ్డి అన్నారు. 1996 నుంచే సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ అంశంపై ఉద్యమాలు జరిగాయని గుర్తు చేశారు.వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో జలయజ్ఞం ద్వారా శ్రీరాంసాగర్ వరద కాలువ, మిడ్ మానేరు, గౌరవెల్లి, గండిపల్లి వంటి ప్రాజెక్టులు ముందుకు సాగాయని పేర్కొన్నారు.




**ఎల్ఎండీకి వెంటనే నీరు విడుదల చేయాలి**

దిగువ మానేరు జలాశయంలో నీటిమట్టం కనిష్ఠ స్థాయికి చేరడంతో కరీంనగర్ ప్రజలు తీవ్ర తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎల్లంపల్లి, మిడ్ మానేరు నుంచి ఎల్ఎండీకి వెంటనే నీటిని విడుదల చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు రావాలని, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ ఆరోపణలకు అతీతంగా ప్రజలకు సాగు, తాగునీరు అందించడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత అని చాడ వెంకటరెడ్డి స్పష్టం చేశారు.

సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి,కొయ్యడ సృజన్ కుమార్,బోయిని అశోక్, గూడెం లక్ష్మి,కసిరెడ్డి సురేందర్ రెడ్డి,న్యాలపట్ల రాజు,పైడిపల్లి రాజు,బీర్ల పద్మ,కొట్టె అంజలి, బాకం ఆంజనేయులు, కసిబోజుల సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.



## కొడిచర్ల లో ఘనంగా ఉరదేవతల పండుగ

- **గంగాజలంతో గ్రామదేవతలకు అభిషేకం చేసిన గ్రామస్తులు**
- **వర్షాలు కురవాలని బోనమెత్తిన మహిళలు**

**కోటగిరి,జులై 21(ప్రజాక్షేత్రం):**

వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం కొడిచర్ల గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ దేవతల పండుగను గ్రామస్తులందరూ కలిసి అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులందరూ కలిసి భాజా భజంత్రీలతో మంజీర నదికెళ్ళి స్నానాలు చేసి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం నదిలో ఉన్న గంగాజలంను తీసుకొచ్చి బాలాజీ మహారాజ్ ఆధ్వర్యంలో గ్రామదేవతలకు అభిషేకం చేశారు.అనంతరం మహిళలందరూ కలిసి భాజభజంత్రీలతో బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా గ్రామ దేవతల వద్దకు వెళ్లి నైవేద్యం సమర్పించారు.ఈ సందర్భంగా బజరంగ్ మహారాజ్ మీడియాతో మాట్లాడుతూ ఆషాడ మాసంలో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం సైతం వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రతి ఒక్కరూ పాడిపంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని గ్రామ దేవతలకు గంగ జలం తో అభిషేకం చేసి బోనాలు సమర్పించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులందరం కలిసి మంజీర నదికి వచ్చి స్నానాలు చేసి గంగా జలమును తీసుకురావడం జరిగిందన్నారు. గంగ చలంతో గ్రామ దేవతలకు అభిషేకం చేయడం జరిగిందన్నారు.గ్రామదేవతుల కృపా కటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండి ప్రతి ఒక్కరూ పాడిపంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కవిత ఈర్వంత్,ఉప సర్పంచ్ కోటగిరి గంగారం,దేవాదయ కమిటీ అధ్యక్షులు మారుతి, కార్యదర్శి నగేష్,క్యాషియర్ లు రాజప్ప,కే .మల్లేష్ , సలహాదారులు కళ్ళప్ప పటేల్,మాజీ సర్పంచ్ పుష్పలత భీమయ్య ,గ్రామ పెద్దలు ప్రకాష్ పటేల్,మాజీ ఎంపిటిసి చంద్రకళ కేశవ్,బీర్ దేవ్ సంఘం అధ్యక్షులు వెంకటేష్, ఎస్సీ సంఘాల అధ్యక్షులు బలగరి ప్రకాష్ ,మేత్రి సంగ్రామ్,భోయి సంఘం అధ్యక్షులు ధర్మయ్య, గ్రామస్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణ పూర్తి చేసుకున్న సర్పంచ్ కు ఘన సన్మానం

- **ఘనంగా సన్మానించిన ఎంపీడీవో విష్ణు,మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు బర్ల మధుకర్**
- **ట్రైనింగ్ తో గ్రామ పంచాయతీ వ్యవస్థ పై అవగాహన పెరిగింది**
- **సర్పంచ్ శ్వేత సూర్యకాంత్**

**కోటగిరి,జులై 21(ప్రజాక్షేత్రం):**

ప్రత్యేక శిక్షణ తరగతుతో నేర్చుకున్న అంశాల వల్ల గ్రామపంచాయతీ వ్యవస్థ పై అవగాహన పెరిగిందని ఎత్తొండ గ్రామ సర్పంచ్ శ్వేతా సూర్యకాంత్ అన్నారు. హైదరాబాద్ లో మూడు రోజులపాటు ప్రత్యేక శిక్షణ తరగతులకు ఎంపికై శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం కోటగిరి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో విష్ణు,మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు బర్ల మధుకర్ ఆధ్వర్యంలో ఆమెకు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో విష్ణు మాట్లాడుతూ....పంచాయతీరాజ్ వ్యవస్థలో మహిళా నాయకత్వాన్ని బలోపేతం చేయడానికై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 3 రోజుల ప్రత్యేక శిక్షణ తరగతులకు నిజామాబాద్ జిల్లా నుండి ఇద్దరు మహిళా సర్పంచులు ఎంపిక కాగా అందులో కోటగిరి మండలంలోని ఎత్తొండ గ్రామ సర్పంచ్ శ్వేత సూర్యకాంత్ ఎంపికవ్వడం మండలానికి గర్వ కారణము అన్నారు .ఈనెల 16 నుండి 18 వరకు హైదరాబాదులో నిర్వహించిన శిక్షణ తరగతుల ను ఆమె దిగ్విజయంగా ముగించుకొని ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నందుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని అన్నారు.సర్పంచుల సామర్థ్యాన్ని పెంచే ఇలాంటి శిక్షణ తరగతులు సర్పంచులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ శ్వేత సూర్య కాంత్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని గ్రామ అభివృద్ధికి వినియోగిస్తూ గ్రామాన్ని ఆదర్శ గ్రామం గా తీర్చిదిద్దుతానని అన్నారు. ఈ శిక్షణ ద్వారా గ్రామ పంచాయతీ వ్యవస్థ పై అవగాహన పెరిగిందని అలాగే శిక్షణలోని అంశాలను తోటి సర్పంచ్ లతో పాలుపంచుకుంటు మండల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో కోట గిరి మండల పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచ్ లు ,మండల ప్రజా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.



## బల్కంపేట ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు పొందిన టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్

**కూకట్పల్లి జూలై 21(ప్రజాక్షేత్రం)**



హైదరాబాద్‌లోని ప్రసిద్ధ బల్కంపేట శ్రీ ఎల్లమ్మ తల్లి దేవాలయాన్ని టీపీసీసీ ఉపాధ్యక్షులు,కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ ఈరోజు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన శ్రీ ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో సుభిక్షంగా అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో పాటు సామరస్యపూర్వకంగా జీవించాలని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు.అనంతరం ఆలయ అర్చకులు బండి రమేష్ కి తీర్థప్రసాదాలు అందజేసి, అమ్మవారి ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో తూము వేణు, లక్ష్మయ్య, క్రాంతి,కలికోట శంకర్, రాము,శ్రీకాంత్ పటేల్,మోహిత్ తదితరులు, అలాగే స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,భక్తులు పాల్గొన్నారు.

## ఆకస్మిక తనిఖీ నిర్వహించిన మండల డెవలప్మెంట్ ఆఫీసర్ జి జలంధర్ రెడ్డి

**వలిగొండ జూలై 21(ప్రజాక్షేత్రం):**

భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని రెడ్లరేపాక గ్రామాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి సందర్శించారు. సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించి,వాటి నిర్వహణపై అధికారులకు తగిన సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని పరిశీలించారు. లబ్దిదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రస్తుతం గ్రామంలో ఇంకా 13 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఫైనల్ స్టేజ్ లో పూర్తికావాల్సి ఉందని గుర్తించి, లబ్ధిదారులు వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని సూచించారు. అలాగే కాంట్రాక్టర్లు, మేస్త్రీలతో మాట్లాడి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం లేదా ఏవైనా అవకతవకలు జరిగినట్లు తేలితే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తదుపరి గ్రామ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి హాజరు రిజిస్టర్,స్టాక్ రిజిస్టర్ను పరిశీలించారు.చిన్నారులు, గర్భిణీలు మరియు బాలింతలకు అందిస్తున్న ఆహారం నాణ్యతను తనిఖీ చేసి, ఎల్లప్పుడూ నాణ్యమైన, పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కమ్యూనిటీ సోక్ పిట్ శాంక్షన్ అయినందున త్వరగతిన పనులు పూర్తి చేయాలని గ్రామపంచాయతీ కార్యదర్శి నీ ఆదేశించారు. ఆ తర్వాత ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎంపీడీఓ గారు, మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత పరిమాణాన్ని పరిశీలించారు.ప్రతి గ్రామంలో వర్షపు నీటి సంరక్షణ చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు.ఈ తనిఖీలో గ్రామపంచాయతీ కార్యదర్శి ఎస్.కె. రసూల్,హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ టి. అశోక్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## ధర్మారెడ్డిపల్లి కాలువ నీరు విడుదల

- **కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ వేముల వీరేశం**
- **ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

**వలిగొండ జులై 21(ప్రజాక్షేత్రం):**

భువనగిరి నియోజకవర్గ రైతాంగం చిరకాలంగా ఎదురుచూస్తున్న శుభ ఘడియ ఆవిష్కృతమైంది. వలిగొండ మండలంలోని సంగెంధర్మారెడ్డిపల్లి కాలువలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం,భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి కలిసి సాగునీటిని విడుదల చేశారు.

ఈ సందర్భంగా కాలువ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నీటిని విడుదల చేసిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, దాదాపు రూ.125 కోట్ల వ్యయంతో చేపట్టిన ధర్మారెడ్డిపల్లి కాలువ నిర్మాణ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 16 నెలల్లోనే సగానికి పైగా పూర్తి చేసి, రైతులకు సాగునీటిని అందించే స్థాయికి తీసుకువచ్చిందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టుకు తమ ప్రభుత్వం వేగం తీసుకొచ్చి రైతుల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిందని అన్నారు.

ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరు నాటికి ధర్మారెడ్డిపల్లి కాలువ నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో పూర్తి చేసి, రైతులకు శాశ్వతంగా సాగునీటిని అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు ఇస్తుందన్నారు ధర్మారెడ్డిపల్లి కాలువలో నీటి విడుదలతో ఈ ప్రాంత రైతుల చిరకాల నిరీక్షణకు తెరపడిందని, కాలువ పూర్తయిన తర్వాత ఈ ప్రాంతం

సస్యశ్యామలంగా మారుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో వలిగొండ మండల, గ్రామాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు,అధికారులు, రైతులు,ఇరిగేషన్ ఈ ఈ,డి ఈ , కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో సంఖ్యలో పాల్గొన్నారు.



## కార్యకర్తలను సమన్వయం చేస్తూ పార్టీని బలోపేతం చేయాలి

- **ఎమ్మెల్యే కాలె యాదయ్య పిలుపు**
- **నూతన మున్సిపల్, మండల కాంగ్రెస్ అధ్యక్షులకు ఘన సన్మానం**

**చేవెళ్ల,జులై 21(ప్రజాక్షేత్రం):**

కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రతి గ్రామానికి తీసుకెళ్తూ, కార్యకర్తలను సమన్వయం చేసుకొని పార్టీని బలోపేతం చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పిలుపునిచ్చారు.

చేవెళ్ల మున్సిపల్ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా ఎంపికైన బి. శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తిప్పని గిరిధర్ రెడ్డిలను ఆయన తన క్యాంపు కార్యాలయంలో పొన్నాడలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే నిజమైన వెన్నెముక అని పేర్కొన్నారు. నూతన నాయకత్వం అందరినీ సమన్వయం చేసుకుంటూ, ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లవేళలా ముందుండాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ నాయకత్వానికి, ఎమ్మెల్యే కాలె యాదయ్యకు నూతన మున్సిపల్ అధ్యక్షుడు బి. శ్రీనివాస్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్తలను భాగస్వామ్యం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఎస్ఐపీ అబాకస్ అకాడమీ – శివం రోడ్, న్యూ నల్లకుంట విద్యార్థుల ఘన విజయం

**మహేశ్వరం జూలై 21 (ప్రజాక్షేత్రం):**

హైదరాబాద్ జోన్ పరిధిలోని ఎస్ఐపీ అబాకస్ అకాడమీ - శివం రోడ్,న్యూ నల్లకుంట బ్రాంచ్ విద్యార్థులు జూలై 12న శంషాబాద్‌లోని క్లాసిక్ కన్వెన్షన్ త్రీలో నిర్వహించిన రీజినల్ ప్రాడిజీ-2026 పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి పలు అవార్డులను కైవసం చేసుకున్నారు.3,200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ ప్రతిష్ఠాత్మక పోటీల్లో మా కేంద్రానికి చెందిన విద్యార్థులు ప్రథమ స్థానం,ద్వితీయ స్థానం,తృతీయ స్థానం, పర్ఫార్మెన్స్ అవార్డులు మరియు బిగినర్ లెవల్ అవార్డులు సాధించి కేంద్రానికి విశేష గుర్తింపు తీసుకువచ్చారు.సెంటర్ హెడ్ ఆతెం శ్రావణి ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ ఘన విజయాన్ని సాధించారు.ఈ విజయానికి అకాడమీ సిబ్బంది సహస్ర,సరస్వతి,వినీత,బుజ్జి అందించిన శిక్షణ, ప్రోత్సాహం,సహకారం ఎంతో దోహదపడ్డాయి.విజేతలుప్రథమ స్థానం:వి.బృందా,ఎస్.భావీర్ మహాత్రే,ఎం.అద్వైత్,ద్వితీయ స్థానం:పి.శ్రేయాంశ్,తృతీయ స్థానం:ఎ.మయాంక్,డి.త్రిపుర,ఎస్.దీక్షిత,కరణ్ స్వైన్,బి.శ్రీనిత,కె.స్వాధింత,పర్ఫార్మెన్స్ అవార్డులు:టి.అమృత, టి.హిమానీ,ఎ.శివాంక్,ఆర్హా ఎస్.మహాత్రే,జి.స్వరంగి,మహ్మద్ వెకార్,అలీనా,సయ్యద్ నుసైర్ అహ్మద్.బిగినర్ లెవల్ అవార్డులు:కె.శ్రీవల్లి,అబ్దుల్లా ఖాన్,జి.ధనుజయ వర్ధన్,ఎస్.ఆక్షిత్,పి.తేజశ్రీ ఈ సందర్భంగా సెంటర్ హెడ్ ఆతెం శ్రావణి విజేతలను అభినందిస్తూ,భవిష్యత్తులో జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అబాకస్ శిక్షణ వల్ల పిల్లల్లో గణితంపై భయం తొలగి,వేగంగా లెక్కలు చేసే సామర్థ్యం పెరగడంతో పాటు జ్ఞాపకశక్తి,ఏకాగ్రత,పరిశీలనా శక్తి,తార్కిక ఆలోచన,ఆత్మవిశ్వాసం,నిర్ణయ సామర్థ్యం వంటి నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని ఆమె తెలిపారు.అలాగే చదువులో మెరుగైన ఫలితాలు సాధించడానికి,పోటీ పరీక్షలకు బలమైన పునాది ఏర్పడటానికి అబాకస్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పిల్లల్లో క్రమశిక్షణ,సమయపాలన,సానుకూల ఆలోచనా విధానం పెంపొందించడంతో పాటు మొబైల్,టీవీలపై గడిపే సమయాన్ని తగ్గించి చదువుపై ఆసక్తి పెంచడంలో కూడా అబాకస్ శిక్షణ కీలక పాత్ర పోషిస్తుందని ఆమె వివరించారు.తల్లిదండ్రుల అద్భుత సహకారం,విద్యార్థుల అంకితభావం,అకాడమీ బృందం నిరంతర కృషి ఫలితంగా రీజినల్ ప్రాడిజీ-2026 పోటీల్లో మా కేంద్రం నుంచి పాల్గొన్న 25 మంది విద్యార్థుల్లో 23 మంది అవార్డులు సాధించడం (92% విజయం) ఎంతో గర్వకారణమని సెంటర్ హెడ్ తెలిపారు.ఈ విజయానికి సహకరించిన తల్లిదండ్రులు,విద్యార్థులు,అకాడమీ సిబ్బంది అందరికీ సెంటర్ హెడ్ ఆతెం శ్రావణి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



# ఎల్-నినోను సమిష్టిగా ఎదుర్కొందాం

- **రైతులు, ప్రజల రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం**
- **అన్ని శాఖలు మిషన్ మోడ్‌లో పనిచేయాలి: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

**మహేశ్వరం జూలై21 (ప్రజాక్షేత్రం):**

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాల నేపథ్యంలో రైతులు,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో మిషన్ మోడ్‌లో పనిచేయాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధికారులను ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధ్యక్షతన ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై నిర్వహించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సమీక్షా సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ,సంభావ్య వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి శాఖ ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి,కంటింజెన్సీ ప్లాన్‌లను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు.రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడం, అవసరమైన విత్తనాల సరఫరా,తాగునీటి ఏర్పాట్లు,పశువులకు మేత,ఉపాధి హామీ పనులు,నిరంతర విద్యుత్ సరఫరా,వైద్య సేవలు వంటి అంశాల్లో ఎలాంటి లోటు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పెసర, కంది,జొన్న,రాగులు వంటి పంటలను ప్రోత్సహించాలని,రైతులకు అవసరమైన ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను వెంటనే అందుబాటులో ఉంచాలని సూచించారు.పశువులకు పశుగ్రాసం కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని,జిల్లాలో తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా జల వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని తెలిపారు.అవసరమైన చోట కొత్త బోర్లు తవ్వించడం,తాగునీటి బోర్లకు నిరంతర విద్యుత్ సరఫరా కల్పించడం,స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రకృతి వైపరీత్యాలను పూర్తిగా నివారించడం సాధ్యం కాకపోయినా,ముందస్తు ప్రణాళికలు,శాఖల మధ్య సమన్వయంతో వాటి ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని స్పీకర్ పేర్కొన్నారు.ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే అనావృష్టి పరిస్థితుల నుంచి ప్రజలను రక్షించడం జిల్లా యంత్రాంగం బాధ్యత అని,అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ,తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పంటలు,ఉద్యాన పంటలు,పండ్ల తోటలు,పూల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. మండల స్థాయిలో వ్యవసాయ,ఉద్యానవన శాఖ అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు.ముఖ్యంగా ఇబ్రహీంపట్నం,మహేశ్వరం ప్రాంతాల్లో వరి సాగు అధికంగా ఉన్నందున నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రైతులకు తగిన సూచనలు అందించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ,అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను అమలు చేయాలని సూచించారు.తాగునీటి కొరత తలెత్తకుండా ప్రత్యామ్నాయ నీటి వనరులను సిద్ధం చేయాలని, గ్రామాలు,పట్టణాల్లో నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.వ్యవసాయ శాఖ రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడంతో పాటు విత్తనాలు,ఎరువులు అందుబాటులో ఉంచాలని,ఉద్యానవన,పశుసంవర్ధక,గ్రామీణాభివృద్ధి,పంచాయతీరాజ్, మున్సిపల్,వైద్య ఆరోగ్య శాఖలు తమ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసి వెంటనే అమలు చేయాలని ఆదేశించారు.సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల యాక్షన్ ప్లాన్‌లు,కంటింజెన్సీ ప్రణాళికలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం తెలంగాణ జలసిరి పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్లు సవ్యసాచి,వికాస్ రాజ్,శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి,కాలే యాదయ్య,వీర్లపల్లి శంకర్,మనోహర్ రెడ్డి,హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి,మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి,మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి,శాసన మండలి సభ్యులు దయానంద్,జిల్లా అదనపు కలెక్టర్లు కె.కిరణ్మయి,చంద్రారెడ్డి,డీఆర్‌ఓ శారద,మున్సిపల్ చైర్మన్లు,ఆర్డీఓలు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఆగస్టు 2న తుక్కుగూడలో ఏఐటీయూసీ జిల్లా నాలుగవ మహాసభ మహాసభలను విజయవంతం చేయండి

- **జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు**

**శంషాబాద్ జులై21(ప్రజాక్షేత్రం):**

ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా నాలుగవ మహాసభలు ఆగస్టు 2న తుక్కుగూడలో జరగబోతున్నాయి.ఆ మహాసభల గోడపత్రికలను మంగళవారం శంషాబాద్ పట్టణ కేంద్రంలోని ఎలైట్ హోటల్ ఆవరణలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభలు జిల్లా పరిధిలోని తుక్కుగూడలో జరుగుతున్నాయి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు బరితెగించి ధరలు పెంచి కార్మికుల బ్రతుకులను ఆగం చేస్తున్నాయని ఆయన విమర్శించారు 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లు గా మార్చి ఎన్నో ఏళ్లు పోరాడి సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేయడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనేక సమ్మెలు అనేక పోరాటాలు నిర్వహించినప్పటికీ నరేంద్ర మోడీ ప్రభుత్వం నిస్సిగ్గుగా లేబర్ కోడులను అమలు చేస్తున్నదని విమర్శించారు జిల్లా మహాసభలలో కార్మికుల సమస్యల పైన తీర్మానాలు చేస్తున్నట్లు తెలిపారు కనీస వేతనాలు 26,000 ఇవ్వాలని ఈఎస్ఐ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ఇక్కడ నిర్మాణం చేయాలని ఆయన మహాసభలలో చర్చించనున్నట్లు తెలిపారు

పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కే రామస్వామి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి వడ్ల సత్యనారాయణ కే చందు యాదవ్ డిహెచ్పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె వెంకటస్వామి.జిల్లా కార్యవర్గ సభ్యుడు సక్రు నాయక్ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యుడు నర్రగిరి మంజుల రాములు తదితరులు పాల్గొన్నారు.




## ఈ నెల 23న మండలాల వారీగా బి ఎల్ ఏ సమావేశాలు

- **సర్ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించనున్న కాంగ్రెస్ నాయకత్వం**
- **బి ఎల్ ఏ ల సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరుకానున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్, సర్ కన్వీనర్ కరణం పురుషోత్తం రావులు**
- **పార్టీ నాయకులు,లు తప్పనిసరిగా హాజరు కావాలని పిలుపు**

**పెద్దేముల్, జూలై 21 (ప్రజాక్షేత్రం)**

తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆదేశాల మేరకు తాండూరు నియోజకవర్గంలో ఈ నెల 23(గురువారం) నాడు మండలాల వారీగా బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశాలు నిర్వహించి, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమంపై సమీక్ష చేపట్టనున్నట్లు కాంగ్రెస్ పార్టీ తాండూరు సర్ నియోజకవర్గ కన్వీనర్ కరణం పురుషోత్తం రావు తెలిపారు.ఈ సమావేశాలకు టీపీసీసీ సర్ పర్యవేక్షకులు కోటిం వినయ్ రెడ్డి, జగదీశ్వర్ రావు హాజరై కార్యక్రమాన్ని సమీక్షించనున్నారు.ముఖ్య అతిథులుగా



తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు జాదవ్ ధారాసింగ్ నాయక్ పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. మండలాల వారీగా సమావేశాల సమయాలు ఇలా ఉన్నాయి. ఉదయం 9:30 గంటలకు తాండూరు పట్టణం, 11:00 గంటలకు బషీరాబాద్, 12:30 గంటలకు యాలాల్, మధ్యాహ్నం 2:30 గంటలకు తాండూరు రూరల్, సాయంత్రం 4:00 గంటలకు పెద్దేముల్ మండలాల్లో సమావేశాలు నిర్వహించనున్నారు.ఈ సమావేశాలకు ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, బూత్ లెవెల్ ఏజెంట్లు , క్లస్టర్ ఇంచార్జీలు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు తప్పనిసరిగా హాజరై సమావేశాలను విజయవంతం చేయాలని కరణం పురుషోత్తం రావు కోరారు.

## బాలికల విద్యకు సమాజం తోడ్పడాలి

- **15 మంది ప్రతిభావంతులైన విద్యార్థినులకు**
- **కలెక్టర్ ఆదర్శ్ సురభి సత్కారం**

**వనపర్తి,జూలై 21(ప్రజాక్షేత్రం):**

బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం మాత్రమే కాకుండా స్వచ్ఛంద సంస్థలు, సమాజంలోని ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పిలుపునిచ్చారు. గ్రామీణ భాగస్వామ్య సంస్థ (విలేజెస్ ఇన్ పార్ట్‌నర్షిప్) ఆధ్వర్యంలో మంగళవారం వనపర్తిలో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

పదో తరగతి తెలుగు మాధ్యమంలో జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన 15 మంది విద్యార్థినులను ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు, మొక్కలు అందించి సత్కరించారు. విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేస్తే జీవితంలో మరిన్ని విజయాలు సాధించగలరని కలెక్టర్ పేర్కొన్నారు. సమాజానికి ఆదర్శంగా నిలిచేలా విద్యను ఆయుధంగా మలుచుకోవాలని సూచించారు.

విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందని, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను కూడా ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య,జిల్లా మహిళా,శిశు సంక్షేమ శాఖ అధికారి సుధారాణి,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రంజిత్ రెడ్డి, గ్రామీణ భాగస్వామ్య సంస్థ వ్యవస్థాపకులు నాగేంద్ర స్వామి తదితరులు పాల్గొన్నారు.



## సమతామూర్తి ప్రాంగణంలో వైభవంగా శ్రీ సుదర్శన పెరుమాళ్ "తిరునక్షత్ర మహోత్సవం

**శంషాబాద్ జులై21(ప్రజాక్షేత్రం):**

శంషాబాద్ మండలం ముచ్చింతల్ శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి దివ్య మంగళాశాసనములతో శంషాబాద్‌లోని 'స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ' ప్రాంగణంలో శ్రీ సుదర్శన పెరుమాళ్ "తిరునక్షత్ర మహోత్సవం" మంగళవారం మహావైభవంగా జరిగింది.

విశ్వశాంతిని, లోకక్షేమాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా సమతామూర్తి కేంద్రంలో శ్రీ సుదర్శన మహా మంత్ర హోమం ఘనంగా నిర్వహించారు. రుత్విక్కుల వేద మంత్రోచ్చారణల నడుమ విశేష పూజలు, పూర్ణాహుతి, మంగళాశాసనం మరియు వేద ఆశీర్వచనం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి.అనంతరం భక్తులందరికీ తీర్థ, ప్రసాద గోష్టి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సుదర్శన జయంతి ఉత్సవాన్ని కళ్లారా తిలకించి, భగవంతుని కృపకు పాత్రులు కావడానికి నగర నలుమూలల నుండి భక్తులు విశేష సంఖ్యలో తరలిరావడంతో సమతామూర్తి ప్రాంగణమంతా భక్తిపారవశ్యంతో కిక్కిరిసిపోయింది. భక్తుల గోవింద నామస్మరణలతో మారుమోగింది.



## ఎస్ఐఆర్ పై సమీక్ష సమావేశం నిర్వహించిన దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర జూలై 20 (ప్రజా-క్షేత్రం):**




దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చిన్నచింతకుంట, కౌకుంట్ల, దేవరకద్ర మండలాల బిఎల్ఎ లు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్లు, మండల మరియు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులతో ఎస్ఐఆర్ పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొని, 100 శాతం ఎస్ఐఆర్ పూర్తయిన బూత్ లకు సంబంధించిన బిఎల్ఎ లను దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ 100% పూర్తయ్యేలా ప్రతి బిఎల్ఎ కృషి చేయాలని,షిఫ్టెడ్ ఓట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.ఆగస్టు 3వ తేదీ వరకు ఎస్ఐఆర్ గడువున్నప్పటికీ, ఈనెల 25వ తేదీనే ఎస్ఐఆర్ డెడ్లైన్ గా భావించి, ప్రతి బూత్ లో 100% ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తిచేయాలని కోరారు.బిఎల్ఏ లు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,సర్పంచులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పదేళ్లు పాలించిన బిఆర్ఎస్ పాలకులు,మళ్లీ అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్నారని,ఎన్ని పగటి కలలు కన్నా బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చేది లేదని ఫైర్ అయ్యారు. స్వయానా మాజీ ముఖ్యమంత్రి కూతురు కవిత బీఆర్ఎస్ ఈ జన్మలో అధికారంలోకి వచ్చేది లేదని చెప్పిన విషయాన్ని ఎమ్మెల్యే జిఎంఆర్ ఈ సందర్భంగా గుర్తుకు చేశారు. పార్టీ కార్యక్రమాలలో కాంగ్రెస్ శ్రేణులు చురుగ్గా పాల్గొనాలని, ప్రభుత్వంపై బిఆర్ఎస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎక్కడికక్కడ తిప్పి కొట్టాలన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరిని గుర్తుంచుకొని, వరుస క్రమంలో అవకాశాలు ఇస్తామని, కష్టపడ్డ ప్రతి ఒక్కరికి అవకాశాలు కల్పించే బాధ్యత నాదని ఈ సందర్భంగా నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే జిఎంఆర్ భరోసా ఇచ్చారు.బిఆర్ఎస్ పార్టీ యూట్యూబ్ ఛానల్ లు పెట్టుకుని ఎంత దుష్ప్రచారం చేసిన ప్రజలు బిఆర్ఎస్ ను నమ్మే పరిస్థితి లేదని అన్నారు.రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 50 వేల మెజార్టీతో దేవరకద్ర నియోజకవర్గంలో గెలిచి, రెండో సారి దేవరకద్ర గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తమని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 14 కు 14 సీట్లను కైవసం చేసుకుంటామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండోసారి అధికారంలోకి వస్తామని, 2034 వరకు ఇక్కడ అధికారంలో ఉండేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే జియంఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్సై యుగంధర్ గౌడ్ జన్మదిన వేడుకలు

**వలిగొండ జూలై 21(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ సబ్ ఇన్స్పెక్టర్ యుగంధర్ గౌడ్ జన్మదిన సందర్భంగా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఎస్సై యుగేంధర్ గౌడ్ జన్మదినం ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా ఎస్సై యుగేంధర్ గౌడ్ ను జర్నలిస్టు యూనియన్ సభ్యులు శాలువా కప్పి కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తూ మండలంలో శాంతి భద్రతలను పరిరక్షిస్తున్న ఆయన భవిష్యత్తులో మంచి స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు బొడిగె సుదర్శన్, సంగిశెట్టి విజయ్ కుమార్, రెబ్బ కుమారస్వామి,దేశపాక కృష్ణ స్వామి,మార్క భగవంత,వీసం రాజు తదితరులు పాల్గొన్నారు.




## భద్రాచలం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా విశ్వ కోయ-గోండు భాష దినోత్సవ వేడుకలు.

**భద్రాచలం,జూలై 21(ప్రజాక్షేత్రం):**

ఆదివాసి భాషలు,సంస్కృతి పరిరక్షణే లక్ష్యంగా భద్రాచలం ఆదివాసి సమితి ఆధ్వర్యంలో మంగళవారం విశ్వ కోయ-గోండు భాష దినోత్సవంను భద్రాచలం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. "మా భాష - మా సంస్కృతి - మా గుర్తింపు", "భాష రక్షణయే జాతి రక్షణ" అనే నినాదాలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆదివాసి భాషల పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ సభ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సంప్రదాయ వస్త్రధారణలో యువకులు డప్పు వాయిద్యాలు, గిరిజన నృత్యాలతో ఆకట్టుకోగా, కోయ-గోండు భాషల గొప్పతనాన్ని ప్రతిబింబించే సందేశాలు అందించారు. కార్యక్రమానికి భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, కోయ-గోండు భాషలు ఆదివాసి సమాజానికి జీవనాధారం, వారసత్వ సంపద అని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో మాతృభాషను మాట్లాడే అలవాటు పెంపొందించాలని, భావితరాలకు భాష, సంస్కృతిని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రపంచీకరణ ప్రభావంతో ఆదివాసి భాషలు అంతరించే ప్రమాదంలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదివాసి భాషలకు తగిన ప్రాధాన్యం కల్పించి, పాఠశాలల్లో కోయ-గోండు భాషలను బోధించే చర్యలు తీసుకోవాలని, భాషలపై పరిశోధనలు, పరిరక్షణ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. "భాష రక్షణయే జాతి రక్షణ" అనే సందేశాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు 10వ వార్డు సభ్యుడు నిట్ట రాజు, 12వ వార్డు సభ్యుడు కారం దుర్గారావు, 13వ వార్డు సభ్యుడు తాటి ఉదయ్, 15వ వార్డు సభ్యురాలు సున్నం ఈశ్వరమ్మ, 17వ వార్డు సభ్యురాలు సున్నం భూలక్ష్మి, 20వ వార్డు సభ్యురాలు ఇర్పా అనసూయ, 9వ వార్డు సభ్యురాలు కారం సుజాత పాల్గొన్నారు. అలాగే సీనియర్ న్యాయవాది పాయం రవివర్మ, ముర్ల రమేష్, తెల్లం రమణయ్య, మోకాలు వెంకటేశ్వర్లు, ఈసాల కృష్ణ, కొరసా రవి, కొరస చిట్టిబాబు దొర, పాండూరి హేమంత్‌తో పాటు భద్రాచలం ఆదివాసి సమితి సభ్యులు, ఆదివాసి పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కార్యక్రమం ముగింపులో కోయ-గోండు భాషలను ప్రతి కుటుంబంలో మాట్లాడాలని, భావితరాలకు మాతృభాషను అందించాలని, ఆదివాసి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పాల్గొన్న అతిథులకు, ప్రజాప్రతినిధులకు భద్రాచలం ఆదివాసి సమితి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.





## ఐఐటీ కలకు చేయూత...గిరిజన విద్యార్థికి సారపాక సర్పంచ్ అండ

- **690వ ర్యాంకు సాధించిన సున్నం జగదీష్‌కు ఆర్థిక సహాయం**
- **"ప్రతిభను ప్రోత్సహించడం సమాజం బాధ్యత" – గుగులోత్ శివరాం నాయక్**
- **సహాయం చేసిన సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు**

**బూర్గంపాడు,జూలై 21 (ప్రజాక్షేత్రం):**

పేదరికం ఎంత పెద్ద సవాలైనా,పట్టుదలతో చదివితే విజయాన్ని అందుకోవచ్చని నిరూపించిన గిరిజన విద్యార్థి సున్నం జగదీష్ కు సారపాక మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ శివరాం నాయక్ అండగా నిలిచారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన జగదీష్ ఐఐటీ ప్రవేశ పరీక్షలో 690వ ర్యాంకు సాధించి తన ప్రతిభను చాటుకోవడంతో, అతని ఉన్నత విద్యాభ్యాసానికి సర్పంచ్ ఆర్థిక సహాయం అందించి అభినందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గుగులోత్ శివరాం నాయక్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో అనేక మంది ప్రతిభావంతులైన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా తమ ఆశయాలను వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు.అలాంటి విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడం ప్రతి ప్రజాప్రతినిధి, ప్రతి దాత సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. సున్నం జగదీష్ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి తన కుటుంబానికి, గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.జగదీష్ తల్లిదండ్రులు సూరిబాబు, సరోజిని మాట్లాడుతూ,తమ కుమారుడి ఉన్నత చదువులకు అండగా నిలిచిన సర్పంచ్ గుగులోత్ శివరాం నాయక్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఆర్థిక సహాయం తమ కుటుంబానికి ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని, జగదీష్ మరింత కష్టపడి చదివి సర్పంచ్ నమ్మకాన్ని నిలబెడతాడని అన్నారు.స్థానికులు జగదీష్ విజయాన్ని అభినందిస్తూ, పేద గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం, దాతలు, స్వచ్ఛంద సంస్థలు మరింత ముందుకు రావాలని కోరారు.ప్రతిభను ప్రోత్సహిస్తే గ్రామీణ ప్రాంతాల నుంచి మరెందరో ఐఐటీలు, ఐఐఎంలు, సివిల్ సర్వీసుల్లో రాణించి సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని అభిప్రాయపడ్డారు.చదువుపై పట్టుదల, సమాజం నుంచి చేయూత కలిస్తే ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని సున్నం జగదీష్ విజయం మరోసారి చాటి చెప్పింది.

## విద్యార్థులతో మమేకమైన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

- **అంజనగిరి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా మారి ప్రత్యేక బోధన.**
- **కూరగాయలు, శాకాహారంపై అవగాహన.**
- **ప్రశ్నలకు చురుగ్గా సమాధానాలు చెప్పిన విద్యార్థులు.**
- **'సర్' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన**

**వనపర్తి,జూలై 21(ప్రజాక్షేత్రం):**

పదవిలో ఉన్నా లేకున్నా ప్రజల మధ్యే ఉండాలనే తన వైఖరిని మరోసారి చాటుకున్నారు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి. నియోజకవర్గ వ్యాప్తంగా కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమాన్ని పరిశీలిస్తూ సోమవారం వనపర్తి మండలం అంజనగిరి గ్రామాన్ని సందర్శించిన ఆయన, అక్కడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోకి వెళ్లి విద్యార్థులతో ఆత్మీయంగా మమేకమయ్యారు. కొద్దిసేపు ఉపాధ్యాయుడి పాత్ర పోషిస్తూ విద్యార్థులకు పాఠాలు చెప్పడం, వారి సందేహాలను నివృత్తి చేయడం, ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టడం అక్కడున్న వారిని విశేషంగా ఆకట్టుకుంది. పాఠశాల తరగతి గదిలోకి వెళ్లిన నిరంజన్ రెడ్డి ముందుగా విద్యార్థులతో పరిచయం పెంచుకొని, వారి చదువులు, లక్ష్యాలు, అభిరుచుల గురించి తెలుసుకున్నారు. అనంతరం బ్లాక్‌బోర్డుపై నియోజకవర్గం, గ్రామాలు, జిల్లా, రాష్ట్రానికి సంబంధించిన పేర్లను రాసి విద్యార్థులను ప్రశ్నించారు. విద్యార్థులు చురుకుగా సమాధానాలు చెప్పడంతో వారిని అభినందించారు. చిన్నారులలో కనిపించిన చురుకుదనం, ఆత్మవిశ్వాసం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు.

**శాకాహారమే ఆరోగ్యానికి బలం**

ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్యకరమైన జీవనశైలిపై ఆయన ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ప్రతిరోజూ పరిశుభ్రంగా ఉండాలని, సమయానికి భోజనం చేయాలని, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. శాకాహారంలో శరీరానికి అవసరమైన పోషకాలు, మాంసకృత్తులు, ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయని వివరించారు. మంచి ఆహారపు అలవాట్లు పిల్లల్లో మేధో వికాసానికి దోహదపడతాయని చెప్పారు. విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా మాట్లాడుతూ, "నేను చిన్నప్పుడు క్యారెట్ ఎక్కువగా తినకపోవడం వల్లే ఇప్పుడు కళ్లద్దాలు పెట్టుకోవాల్సి వచ్చింది" అని చమత్కరించడంతో తరగతి గది నవ్వులతో మార్మోగింది. దీంతో చిన్నారులు మరింత ఉత్సాహంగా పాఠాన్ని ఆలకించారు.

**ఉపాధ్యాయులకు సూచనలు**

పిల్లల్లో మంచి ఆరోగ్య అలవాట్లు పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. కూరగాయలు, ఆకుకూరలు, పౌష్టికాహారం ప్రాధాన్యంపై విద్యార్థులకు తరచూ అవగాహన కల్పించాలని సూచించారు. విద్యతో పాటు ఆరోగ్యం కూడా సమానంగా అవసరమని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించగలరని అన్నారు.

**సర్ కార్యక్రమానికి ప్రజల భాగస్వామ్యం అవసరం**

పాఠశాల సందర్శన అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రతి అర్హుడైన ఓటరు తుది జాబితాలో పేరు నమోదు అయ్యేలా ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. పారదర్శకమైన ఓటరు జాబితా ద్వారానే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. గ్రామాల వారీగా ప్రజల్లో అవగాహన పెంచేందుకు నిర్వహిస్తున్న పర్యటనలకు విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె. మాణిక్యం, రఘువర్ధన్ రెడ్డి, రవిప్రకాష్ రెడ్డి, మాధవ్ రెడ్డి, నాగవరం నరేష్, దేగ మహేశ్వర్ రెడ్డి, చిట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.



# సర్ ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలి

- **డిజిటలైజేషన్ పురోగతిపై రోజువారీ సమీక్ష**
- **మందకొడిగా ఉన్న బూత్‌లపై ప్రత్యేక దృష్టి**
- **బీఎల్‌ఏ-2లు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలి:**
- **డీసీసీ చీఫ్ శివసేన రెడ్డి**

**వనపర్తి,జూలై 21 (ప్రజాక్షేత్రం):**

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియను పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శివసేన రెడ్డి సూచించారు. జిల్లాలో ఎక్కడా ఓటరు జాబితాలో అక్రమాలకు తావులేకుండా బీఎల్ఏ2లు, ఇన్‌చార్జులు సమర్థవంతంగా పనిచేయాలని కోరారు.
వనపర్తిలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్ ప్రక్రియ పురోగతి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ జూమ్ సమావేశాల ద్వారా సర్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.
డిజిటలైజేషన్ ప్రారంభమైనప్పటి నుంచి మండలాలు, గ్రామాల వారీగా నమోదవుతున్న నివేదికలను పరిశీలిస్తున్నామని, మందకొడిగా సాగుతున్న బూత్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మిగిలిన సమయాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామాల్లోనే ఉండి పని చేస్తేనే వంద శాతం లక్ష్యాన్ని చేరుకోవచ్చని పేర్కొన్నారు.
సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి,మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్,పట్టణ అధ్యక్షుడు కదిరే రాములు, ఇన్‌చార్జులు కోళ్ల వెంకటేష్, శరవంద,విజయలక్ష్మి,బి.కృష్ణ, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.




## యాత్ర విషాదంలో అండగా ఎమ్మెల్యే మేఘారెడ్డి

- **మానవత్వం చాటిన ప్రజాప్రతినిధి**
- **మృతదేహం తరలింపు..**
- **క్షతగాత్రుల చికిత్సకు వెంటనే రూ.1.15 లక్షల సాయం**
- **బాధిత కుటుంబాలకు భరోసా.. ప్రభుత్వ సహాయానికి కృషి చేస్తానని హామీ**

**వనపర్తి,జూలై 21 (ప్రజాక్షేత్రం):**



తమిళనాడులో ఆధ్యాత్మిక యాత్రకు వెళ్లిన వనపర్తి వాసులను విషాదంలోకి నెట్టిన రోడ్డు ప్రమాదం నేపథ్యంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రమాదంలో వనపర్తి పట్టణానికి చెందిన చీర్ల శ్యామ్ సాగర్ (స్వామి) మృతి చెందగా, పలువురు గాయపడిన విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే స్పందించి బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు. ప్రమాద వివరాలు తెలుసుకున్న వెంటనే అధికారులతో పాటు స్థానిక నాయకులతో మాట్లాడి బాధితులకు అవసరమైన సహాయ చర్యలను వేగవంతం చేయించారు.
మృతుడు చీర్ల శ్యామ్ సాగర్ మృతదేహాన్ని స్వస్థలమైన వనపర్తికి తీసుకురావడంతో పాటు ప్రమాదంలో గాయపడిన వారిని సురక్షితంగా తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయించారు. ప్రమాదం కారణంగా ఒక్కసారిగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఊరటనిచ్చేలా మృతదేహం తరలింపు, క్షతగాత్రుల చికిత్స, రవాణా తదితర అత్యవసర ఖర్చుల కోసం మొత్తం రూ.1.15 లక్షల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే మేఘారెడ్డి వారికి ధైర్యం చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో అధైర్యపడవద్దని, ప్రభుత్వం తరఫున అందే అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చికిత్స పొందుతున్న క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అవసరమైన వైద్యసేవలు అందేలా అధికారులకు సూచనలు చేసినట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన సమాచారం అందిన క్షణం నుంచే బాధితులకు అండగా నిలిచి, ఎలాంటి ఆలస్యం లేకుండా సహాయ చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే తీరుపై బాధిత కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. ఇలాంటి సమయంలో తమకు ధైర్యం చెప్పి ఆర్థికంగా చేయూతనందించిన ఎమ్మెల్యేకు వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ప్రజలు కూడా ఎమ్మెల్యే స్పందనను అభినందిస్తూ, ప్రజలకు అవసరం వచ్చిన ప్రతిసారి ముందుండి సహాయం చేయడం ఆయన సేవాభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తూ మానవత్వంతో వ్యవహరించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తీరును పలువురు ప్రశంసించారు. ఇలాంటి విషాద సమయంలో బాధిత కుటుంబాలకు ఆర్థికంగా, మానసికంగా అండగా నిలవడం ప్రజాప్రతినిధి బాధ్యతను మరోసారి చాటిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.



## ఆంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం

**చౌటుప్పల్ జూలై 21(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు ఎస్పీ మరియు చౌటుప్పల్ డీఎస్పీ ఆదేశాలు, మార్గదర్శకత్వంలో, చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ ఆధ్వర్యంలో వీవీఆర్ గార్డెన్స్‌లో విద్యార్థులు, యువత కోసం ఆంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా మత్తు పదార్థాలు, డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం, విద్య, కుటుంబ జీవితం, సమాజం మరియు భవిష్యత్తుపై కలిగే తీవ్ర దుష్పరిణామాలను వివరించారు. మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, చెడు అలవాట్లకు బానిస కాకుండా మంచి మార్గంలో ముందుకు సాగాలని, ఎక్కడైనా డ్రగ్స్‌కు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీవీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి వందలాది మంది విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొని డ్రగ్స్ నిర్మూలనకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు.



## రంగారెడ్డి జిల్లా యోగాసనా స్పోర్ట్స్ ఛాంపియన్షిప్2026

- **ఉత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీధర్ గౌడ్..**
- **నీళ్ల శ్రీధర్ గౌడ్ ను అభినందించిన ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్..**

**శంషాబాద్ జులై21 (ప్రజాక్షేత్రం):**

రాజేంద్రనగర్ శివరాంపల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి యోగా పోటీలలో శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామానికి చెందిన నీళ్ళ. శ్రీధర్ గౌడ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి పురుషుల సీనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించి సర్టిఫికెట్ పొందడం జరిగింది. ఈ సందర్భంగా పాలమాకుల గ్రామ యోగా సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా శిక్షకులు శ్రీ కట్ట మల్లేష్ గౌడ్ తో పాటు కలిసి రాజేంద్రనగర్ నియోజకవర్గం గౌరవ శాసనసభ్యులు టి.ప్రకాష్ గౌడ్ గారిని మర్యాద పూర్వకంగా కలిసి వారిని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.మా పాలమాకుల గ్రామానికి జిల్లాలోనే పేరు వచ్చేలా చేసిన అంతర్జాతీయ యోగా శిక్షకులు శ్రీ కట్ట మల్లేష్ గౌడ్ గారిని ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ గారు సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు.యోగాతో మానవ జీవితంలో సంపూర్ణమైన ఆరోగ్యం,ఆలోచన శక్తి, మానవ జీవన విధానంలో మార్పు ద్వారా మనిషి తనని తాను ఆరోగ్యవంతుడిగా నిరూపించుకోవడంలో యోగ ప్రాముఖ్యత అనిర్వచనీయం, శ్రేష్ఠ భారత్,ఆరోగ్య భారత్ నినాదంతో మనిషి జీవన విధానాన్నికి యోగ ఒక వజ్రాయుధముల మనిషిని జీవనాన్ని పునర్ నిర్మించడంలో దోహదపడుతుందని తెలియజేశారు.యోగ ప్రాముఖ్యత గురించి మరింత ఎక్కువగా ప్రజలకు చేరే విధంగా కృషి ప్రజలను యోగాలో భాగస్వాములు చేయాలని వారికి సూచించడం జరిగింది .ఈ కార్యక్రమంలో పాలమాకుల గ్రామ యోగ సమితి సభ్యులతోపాటు గ్రామ సర్పంచ్ కోటేష్ గౌడ్,మాజీ ఉపసర్పంచ్ యాసారం ప్రవీణ్ గౌడ్ పాల్గొన్నారు.




## ఆరెగూడెంలో కెమెరాల ప్రారంభం..

**చౌటుప్పల్ జూలై 21(ప్రజాక్షేత్రం):**

ఆరెగూడెం గ్రామంలో వివిఆర్ ఆర్గానిక్ యాజమాన్యం సౌజన్యంతో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు యాదాద్రి భువనగిరి అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడం జరిగినది. అనంతరం అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వలన ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు దొంగతనాలు జరగవని అన్నారు. గ్రామ ప్రజలు ఎలాంటి భయా ఆందోళన చందకుండా నిర్భయంగా ఉండవచ్చని అన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటుచేసిన వివిఆర్ ఆర్గానిక్ యజమాన్యాన్ని, సర్పంచ్ ఎన్నెపెల్లి ధనలక్ష్మి వెంకట్ రెడ్డిని అభినందించారు. అనంతరం స్కూల్లో మొక్కలు నాటి నీళ్ళు పోశారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ డి.ఎస్.పి మధుసూదన్ రెడ్డి, సిఐ మన్మధ కుమార్, గ్రామ సర్పంచ్ ఎన్న పెల్లి ధనలక్ష్మి వెంకటరెడ్డి, ఉపసర్పంచ్ నిర్మల సూర్యనారాయణ, చౌటుప్పల్ ఎస్సై నర్సిరెడ్డి, ఇతర పోలీస్ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## శ్రీ కృష్ణవేణి హై స్కూల్‌లో ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం.

**రామగుండం జులై 22 ప్రజాక్షేత్రం:**

గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని శ్రీకృష్ణవేణి హై స్కూల్‌లో ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, భవ్య కంటి దవాఖాన సహకారంతో ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భవ్య విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన సూచనలు అందించారు.ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రౌతు గణేష్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుకు మంచి కంటిచూపు ఎంతో అవసరమని, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణవేణి హై స్కూల్ ప్రిన్సిపాల్ శైలజ, ఫౌండేషన్ సభ్యులు కోలేటి విశాల్, కామెర శ్రీనిత్, రిషి, మీస వికాస్, మార్క ఆశ్రిత్ గౌడ్, విద్యార్థులు మరియు ఇతరులు పాల్గొన్నారు.



## ఖబర్దార్! మోదీ విద్యార్థుల జీవితాలతో చెలగాటమా!

- **కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి!**
- **యువజన కాంగ్రెస్ విద్యార్థి నాయకుడు రాజ్ కుమార్**



**తలకొండపల్లి, జూలై 22(ప్రజాక్షేత్రం):**

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ.. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కల రాయాలని చూస్తే ఖబడ్దార్! ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసానికి శాంతియుత ర్యాలీగా బయలుదేరిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు శ్రీ రాహుల్ గాంధీ గారిపై దాడి చేయడం ప్రజాస్వామ్యంపై జరిగిన దాడేనని యువజన కాంగ్రెస్ విద్యార్థి నాయకుడు తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశ యువత ఎదుర్కొంటున్న సమస్యలు, పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు, నిరుద్యోగం, నియామకాలలో అవకతవకలు వంటి అంశాలపై ప్రధానమంత్రి నుండి సమాధానం కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాంతియుతంగా నిర్వహించిన ర్యాలీని అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రజల తరపున ప్రశ్నించే హక్కు ప్రతిపక్షానికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఆ హక్కును కాలరాస్తూ ప్రతిపక్ష నాయకుడిపై భౌతికంగా దాడి చేయడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను వినిపించేందుకు, యువత భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానం కోరేందుకు వెళ్లిన రాహుల్ గాంధీ గారిని అడ్డుకోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వం తన అసహన వైఖరిని బయటపెట్టుకుందని విమర్శించారు.దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కానీ విభిన్న అభిప్రాయాలను అణచివేయడానికి ప్రయత్నించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని అన్నారు. ప్రజల గొంతుకగా నిలుస్తున్న రాహుల్ గాంధీ గారిపై జరిగిన ఈ దాడిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం యువజన కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని యువజన కాంగ్రెస్ విద్యార్థి నాయకుడు స్పష్టం చేశారు.



## రాజురా రామాలయ నిర్మాణానికి రూ. 50 లక్షలు అందజేసిన మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

**నిర్మల్ జిల్లా జూలై 21(ప్రజాక్షేత్రం):**

ముధోల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు జి విఠల్ రెడ్డి లోకేశ్వరం మండలంలోని రాజురా గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మించ తలపెట్టిన శ్రీ రామాలయ నిర్మాణానికి సంబంధించి రూ. 50 లక్షల నిధుల టెండర్ అప్రూవల్ కాపీని ఆయన గ్రామస్తులకు ఘనంగా అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి మాట్లాడుతూ.. రాజురా గ్రామంలో రామాలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 50 లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. ఇందులో సి.జి.ఎఫ్ (CGF) నిధుల నుండి రూ. 40 లక్షలు, గ్రామస్తుల డిపాజిట్ కింద రూ. 10 లక్షలు కేటాయించినట్లు వివరించారు. టెండర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని, త్వరలోనే కాంట్రాక్ట్ అగ్రిమెంట్ పూర్తి చేసుకుని ఆలయ నిర్మాణ పనులను వేగంగా ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఆలయ నిర్మాణానికి టెండర్ ఆమోదించి నిధులు విడుదల చేసినందుకు గాను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికు, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ముధోల్ నియోజకవర్గ ప్రజల తరపున ఆయన ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్యామల, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముత్త గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ రత్నాకర్ రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ నరసన్న, ఆత్మ చైర్మన్ నర్సారెడ్డి, పిఏసిఎస్ వైస్ చైర్మన్ గంగాధర్, మండల సర్పంచులు భుజంగ్ రావు, రాజశేఖర్ రావు, కపిల్, ఆలయ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

## ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ మెరుపు ధర్నా

**ఢిల్లీ జులై 21(ప్రజాక్షేత్రం):**

ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నీట్ లీకేజీ, ఢిల్లీలో పోలీసుల లాఠీఛార్జ్, అణిచివేత చర్యలకు నిరసనగా.. ప్రధాని నరేంద్ర మోడీ నివాసం దగ్గర కాంగ్రెస్ నేతలు ధర్నాచేశారు. మల్లికార్జునఖర్గే, ప్రియాంక గాంధీ, కెసి వేణుగోపాల్, ఇతర నేతలు, కాంగ్రెస్ ఎంపిలు పాల్గొన్నారు. ప్రధాని మోడీ రాజీనామా చేయాలంటూ రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు ధర్నా చేయగా.. గూండాగిరి నిరంకుశత్వం నడవదంటూ నినాదాలు చేశారు. చేతులకు తాళ్లు కట్టుకొని.. చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన చేశారు. పలువురు కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని వాహనాల్లో తరలిస్తున్నారు. యువతపై లాఠీఛార్జ్‌కి బాధ్యత వహిస్తూ ప్రధాని రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు నినాదాలు చేశారు. ఎన్డిఎ ప్రభుత్వంలో జవాబుదారీతనం లోపించిందని, నీట్ లీకేజీపై పార్లమెంట్ లో చర్చకు కూడా ఒప్పుకోవడం లేదని అన్నారు. ప్రధాని మోడీ మౌనం వీడాలని, నీట్ అంశంపై మోడీ సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.



# సమస్యలు పరిష్కరించలేని సంఘాలు ఎందుకు...?

- **సభ్యత్వ రుసుం చెల్లించబోం...**
- **స్కూళ్ల వారీగా తీర్మానాలు**
- **ఉపాధ్యాయ సంఘాలకు మాస్టర్ల షాక్**
- **డీఏలు లేవు.. పీఆర్సీ రాలేదు... ఓపీఎస్ ఎక్కడని నిలదీత**
- **ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో విఫలమయ్యారంటూఆగ్రహం**






దశాబ్దాలుగా ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడుతున్నామని చెప్పుకునే సంఘాలకు ఇప్పుడు సొంత సభ్యుల నుంచే ఊహించని ప్రతిఘటన ఎదురవుతోంది. మీ సంఘాలు మాకొద్దు.. మీ సభ్యత్వం మాకొద్దు అంటూ కొంతమంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బాహాటంగానే తిరుగుబాటు బావుటా ఎగురవేస్తున్నారు. ఇకపై ఏ సంఘానికి వార్షిక సభ్యత్వ రుసుం చెల్లించబోమంటూ పాఠశాలల వారీగా ఏకగ్రీవ తీర్మానాలు చేస్తుండటం ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది. రాష్ట్రంలో దాదాపు 1.10 లక్షల మందికి పైగా ఉపాధ్యాయులున్నారు. వీరంతా పీఆర్టీయూ, యూటీఎఫ్, టీపీటీఎఫ్, ఎస్టీయూ, డీటీఎఫ్ వంటి వివిధ సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. ఏటా ఈ సంఘాలకు సభ్యత్వ రుసుము చెల్లిస్తూనే ఉన్నారు. కొంతకాలంగా ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో ఈ సంఘాలు పూర్తిగా విఫలమయ్యాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**టీచర్లు లేవనెత్తుతున్న ప్రశ్నలు ఇవే...**

సుమారు ఆరు డీఏలు పెండింగ్లో ఉన్నా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిసాధించడంలో సంఘాలు ఎందుకు వెనకబడి ఉన్నాయని ప్రశ్నిస్తున్నారు. కొత్త పీఆర్సీ ఫిట్మెంట్ విషయంలో ప్రభుత్వం నుంచిస్పష్టమైన హామీ పొందలేక పోవడం. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేసి, ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) పునరుద్ధరించాలనే ప్రధాన డిమాండ్ గాలికొదిలేశారా? అని యూనియన్ నేతలను ప్రశ్నిస్తున్నారు.

క్షేత్రస్థాయిలో గట్టి పోరాటాలు చేయాల్సింది పోయి, కేవలం వినతిపత్రాలకే సంఘ నాయకులు పరిమితమవుతున్నారని టీచర్లు మండిపడుతున్నారు. మరికొందరేమే సొంత పైరవీలు చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఇటీవల వనపర్తి, మెదక్, ఆది లాబాద్ వంటి జిల్లాల్లోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమావేశమై ఒక సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఒకే స్కూల్లో వేర్వేరు సంఘాలకు చెందిన టీ చర్లు ఉన్నప్పటికీ, అందరూ ఏకతాటిపైకి వచ్చి.. ఏ సంఘానికీ చందా కట్టం అని తీర్మానించారు.

**ఇతర శాఖల్లోనూ చర్చ..**

ఒక పాఠశాలలో మొదలైన ఈ తీర్మానాల పరంపర ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా రాష్ట్రమంతటా పాకుతోంది. ఒక స్కూల్ టీచర్లు చేసిన తీర్మానం కాపీలు చూ సి, ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు కూడా అదే బాటలో నడిచేందుకు సిద్ధమవు తున్నారు. ఇది కేవలం ఉపాధ్యాయ రంగంతోనే ఆగిపోకుండా, ఇతర ప్రభుత్వశాఖల ఉద్యోగ సంఘాల్లోనూ కలవరం పుట్టిస్తోంది. సభ్యత్వ రుసుం నిలిపివేస్తే సంఘాల ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని నాయకులు ఆందోళన చెందుతున్నారు. సం ఘాల నాయకులు ప్రభుత్వం వద్ద తమ వ్యక్తిగత పనుల కోసం పాకులాడుతున్నారు. తప్ప, సాధారణ ఉపాధ్యాయుడి కష్టాలను పట్టించుకోవడం లేదు అనేది మెజారిటీ టీ చర్ల వాదన. ఇప్పటికైనా సంఘాలు తమ పంథాను మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**2008 కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సర్వీస్ పొడిగింపు**

రాష్ట్రంలో డీఎస్సీ2008 సెకండరీ గ్రేడ్ కాంట్రాక్ట్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న 1,181 మంది సర్వీసులను మరో ఏడాది పాటు పొడిగిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పొడిగింపు ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2027 మార్చి 31 వరకు అమల్లో ఉంటుందని తెలిపారు. ఈ కాంట్రాక్ట్ ఉపా ధ్యాయుల వేతనాల కోసం ప్రభుత్వం రూ. 21,99,49,440బడ్జెట్ను విడుదల చేసిందని, వీరికి నెలకు రూ. 31,040 చొప్పున గౌరవవేతనం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పొడిగింపునకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ కొన్ని ముఖ్యమైన నిబంధనలను విధించింది. అభ్యర్థులతో కొత్తగా ఒప్పంద పత్రాలు రాసుకోవాలని, వేతనాలు ఐఎఫ్ఎంఐఎస్ డీబీటీ ద్వారానే చెల్లించాలని స్పష్టం చేసింది. రిటైర్డ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోకూడదని, ఖాళీల్లో కొత్త నియామకాలు చేపట్టకూడదని నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మినహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులు ఈ ఆదేశాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని నవీన్ నికోలస్ ఆదేశించారు

**ఏం రవీందర్**
**సీనియర్ జర్నలిస్ట్**
**7901503777**




## మోదీ పాలనలో పెట్టుబడిదారుల చేతుల్లోకి మీడియా అకాడమీ చైర్మన్

**రామగుండము జులై 21(ప్రజాక్షేత్రం):**

ప్రజల పక్షాన నిలిచి, నిష్పక్షపాతంగా పని చేసినప్పుడే జర్నలిస్టులకు ప్రజల గుండెల్లో స్థానం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రోలిటేరియన్ జర్నలిస్ట్ మునీర్ బాయ్ పుస్తక పరిచయ సభలో మీడియా అకాడమీ చైర్మన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతదేశంలో పెట్టుబడి దారుల చేతుల్లోకి మీడియా రంగం వెళ్లిపోయిందని అన్నారు. గడిచిన 12 సంవత్సరాలలో ప్రధానమంత్రి కనీసం ఒక్క మీడియా సమావేశం కూడా ఏర్పాటు చేయలేదని ఇది ప్రజాస్వామ్యానికి, ప్రజలకు నష్టదాయకమని పేర్కొన్నారు. జర్నలిజాన్ని నమ్ముకుని జీవితాంతం అన్యాయాన్ని, ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ, పాలకుల లోపాలను ఎత్తిచూపుతూ ఎన్నో కష్టాలను ఎదుర్కొన్న జర్నలిస్ట్ మునీర్ జీవితం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. నిర్భయంగా, ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా, వాస్తవ సమాచారాన్ని ప్రజలకు అందించడమే జర్నలిస్టుల కర్తవ్యం అని ఆయన ఉద్బోధించారు.

ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్స్ వలన సమాజంలో నాలుగవ స్తంభంగా నిలబడిన జర్నలిస్టులను, దుకాణాలలో పనిచేసే కూలీలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చారని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. జర్నలిస్టుల జీతభత్యాల పెరుగుదలకు మరో సమరశీల పోరాటం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అప్రజాస్వామికంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. ప్రధాన పత్రికా రంగంలో వృత్తి నిబద్ధత కోల్పోవడం వలన సోషల్ మీడియాకు ఆదరణ పెరిగిందని తేల్చి చెప్పారు. సోషల్ మీడియాలో వచ్చే కొన్ని కథనాలు వాస్తవానికి దూరంగా ఉంటున్నాయని, వాటిపై ఏలాంటి తనిఖీ, నియంత్రణ లేకపోవడం వల్ల విచ్చలవిడితనం పెరిగిపోతున్నదని దీనిని కట్టడి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఆదర్శప్రాయుడు మునీర్ అక్షరాలను నమ్ముకుని జీవితాంతం పనిచేసిన మునీర్ జీవితం ఆచరణీయమని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ కొనియాడారు. ముఖ్యమంత్రిలతో సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ సామాన్యమైన జీవితాన్ని గడుపుతూ, ప్రజల కోసమే మునీర్ పనిచేశాడని ఆయన పేర్కొన్నాడు. కోల్ బెల్ట్ జర్నలిస్టులు ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచారని అన్నారు. మునీర్ జీవితంపై పరిశోధన చేయాలని సూచించారు. అక్షర ఫౌండేషన్ అధ్యక్షుడు మాదాసి రామమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో రామగుండం కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య ఐజేయు టీయూడబ్ల్యూజే జాతీయ నాయకుడు నగునూరి శేఖర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంపత్ కుమార్ జిల్లా అధ్యక్షుడు మల్లావజుల వంశీ, గోదావరిఖని ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు డి. మాధవరావు , గడ్డం శ్యామ్ కుమార్, ఇఫ్తా జాతీయ నాయకులు కే స్వామి, కార్మిక సంఘాల నాయకులు తుమ్మల రాజిరెడ్డి , రియాజ్ అహ్మద్, పర్లపల్లి రవి , ఐ కృష్ణ , మల్లికార్జున్ , శ్రోతులు కె విశ్వనాథ్ , తోకల రమేష్ , రచయిత నక్క వెంకట్రావు, పుస్తక సమీక్షను హెచ్ రవీందర్ నిర్వహించారు. గంభీరావుపేటలో రెండు చోరీ కేసులు ఛేదన నలుగురి అరెస్ట్ అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ, ఏలేశ్వరం వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల నాయకులు గాండ్ల శ్రీనివాస్, బక్క రవి, శేఖర్, కోల లక్ష్మణ్, పాలకుర్తి విజయకుమార్, మామిడి సత్యనారాయణ, మనోహర్ రెడ్డి, సుధాకర్ రావు, జేవి రాజు,శ్రీపతి రాజగోపాల్,మైనార్టీ నాయకులు హమీద్, మాల మహానాడు నాయకులు మర్రి ఐలయ్య, పిట్టల వెంకటి, నంది నరేష్, ప్రజానాట్యమండలి కళాకారులు కన్నం లక్ష్మీనారాయణ, చీకటి అంజయ్య, ఎజ్జ రాజయ్య, దయా నర్సింగ్ , జనగామ రాయనర్స్ , పద్మ, రమ తదితరులు పాల్గొన్నారు.






## ధర్మేంద్ర ప్రధాన్ కాదు మోదీ రాజీనామా చేయాలి

- **కాక్రోచ్ లపై దాడిని ఖండిస్తున్నాం**
- **బీసీ హక్కుల సాధన సమితి ధనుంజయ నాయుడు ప్రకటన**

**హైదరాబాద్ జులై 21(ప్రజాక్షేత్రం):**

ఢిల్లీలో శాంతియుతంగా ర్యాలీ నిర్వహించిన విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీ ఛార్జికి బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనంజయ నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం నాడు హైదరాబాదులోని హిమాయత్ నగర్ లో గల బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో బీసీ ముఖ్య నాయకులు కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ... నీట్ క్వశ్చన్ పేపర్ లీకేజీకి బాధ్యతవహిస్తూ కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలోలో 23 రోజులుగా జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసనకు దిగితే ఎలాంటి చర్చలు ప్రారంభించని కేంద్రం... శాంతియుత ర్యాలీ నిర్వహిస్తే మాత్రం పోలీసులు, పారామిలటరీ దళాలతో అణచివేయడం దారుణమని ఆయన మండి పడ్డారు. ఇంతటి అలజడికి కారణమైన మోడీ తన పదవి నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన వ్యక్తం చేసే హక్కు రాజ్యాంగం కల్పించిందని.. అలాంటి హక్కును కాలరాయడం బీజేపీకి కొత్తేమీ కాదని ఆయన అన్నారు. దేశంలో అశాంతి, అన్ని వర్గాల ప్రజలను మోసగిస్తూ, విద్యార్థుల జీవితంలో మట్టికొడుతున్న మోదీ లీకుల సర్కారును ఇంటికి సాగనంపాలని ఆయన పిలుపునిచ్చారు. రాజకీయాల్లోకి రాముడిని గుంజి దేశాన్ని మతం పేరుతో ముక్కలు చేయాలని ప్రయత్నిస్తున్న బిజెపి వారి నిజస్వరూపాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని రాములోరి పేరుతో వసూలు చేసిన విరాళాలు భక్తులు ఇచ్చిన కానుకలు చోరీ చేసి భక్తుల మనోభావాలను కించపరచిన వారికి దేశాన్ని పాలిచ్చే హక్కు లేదని అన్నారు. ఆయన వెంట బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి చింతకింది కుమారస్వామి కట్కోజు చంద్రశేఖర్ చెలుకల రాజు గాజుల సుమలత ఉన్నారు.

## మరకత శివాలయంలో ఇస్రో రిటైర్డ్ సీనియర్ సైంటిస్ట్ శ్రీనివాసులు దంపతులు ప్రత్యేక పూజలు

**శంకర్‌పల్లి జులై 21(ప్రజాక్షేత్రం):**

శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11 వ శతాబ్దానికి చెందిన మరకత శివాలయంలో మంగళవారం ఇస్రో రిటైర్డ్ సీనియర్ సైంటిస్ట్ శ్రీనివాసులు, కృష్ణవేణి దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ కడకంచి కుమార్ యాదవ్, ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్ రాజు స్వామి, వైస్ చైర్మన్ నర్సింలు వారిని స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేసి, స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు. కార్యక్రమంలో అర్చకులు సాయి శివ, కమిటీ సభ్యులు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.





## దర్శకురాలుగా పరిచయం కాబోతున్న హీరోయిన్.. ఇంట్రెస్టింగ్ లైన్‌తో సినిమా!

టాలీవుడ్ ఇండస్ట్రీకి మరో కొత్త మహిళా దర్శకురాలు పరిచయం కాబోతున్నట్లు తెలుస్తుంది. లెజండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన 'సింగ్ గీతం' చిత్రంలో హీరోయిన్‌గా నటించి ప్రశంసలు అందుకున్న యంగ్ నటి షాలిని కొండేపూడి.. ఇప్పుడు దర్శకత్వం వైపు అడుగులు వేస్తున్నట్లు ఫిలిమ్ వర్గాల నుంచి సమాచారం. తొలి చిత్రం 'సింగ్ గీతం'లో తన సహజమైన నటన, రూపంతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న ఈమె.. ఇప్పుడు తన గుర్తింపును మరింతగా పెంచుకుంటూ మెగాఫోన్ పట్టేందుకు సిద్ధం అవుతున్నట్లు టాక్. అందుతున్న సమాచారం ప్రకారం.. షాలిని కొండేపూడి దర్శకత్వం చేయనున్న తొలి చిత్రం ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందనుందట. కుటుంబ బంధాలు, భావోద్వేగాలు, వినోదం ప్రధానంగా సాగే కథతో అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ ప్రాజెక్టు ప్లాన్ చేస్తున్నారని తెలుస్తుండగా.. దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది.

## హాలీవుడ్‌ను చూసి నేర్చుకోండి..

అక్కినేని అఖిల్ మూడేళ్ల గ్యాప్ తర్వాత వచ్చిన యాక్షన్ మూవీ 'లెనిన్'. మురళి కిషోరు అబ్బూరి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా ఫస్ట్ డే నుంచి బాక్సాఫీసు వద్ద సూపర్ హిట్ టాక్‌ను దక్కించుకుంటోంది. మొదటి రోజు నుంచే భారీ కలెక్షన్స్ రాబడుతూ దూసుకెళ్తోంది. ఏజెంట్' పరాజయం తర్వాత అఖిల్‌కు ఈ రేంజ్ హిట్ రావడంతో అక్కినేని అభిమానులు పండగ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన 'లెనిన్' సక్సెస్ మీట్‌లో నాగార్జున పాల్గొని టాలీవుడ్ చిత్రాల విడుదల తేదీలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హాలీవుడ్ చిత్రం 'ఒడిస్సీ' ఏడాది ముందే డేట్ ప్రకటించి సరిగ్గా అదే తేదీకి వచ్చిందని, కానీ మన దగ్గర రిలీజ్ డేట్స్ ఇచ్చినా సమయానికి సినిమాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

'లెనిన్' విషయంలోనూ ఇదే జరిగిందని, తాను జూన్ 26న విడుదల తేదీ ప్రకటించినప్పటికీ పోస్ట్ ప్రొడక్షన్ ఆలస్యం కావడంతో వాయిదా వేయాల్సి వచ్చిందని తెలిపారు. గతంలో 'నిన్నే పెళ్లాడతా', 'అన్నమయ్య' చిత్రాల కాపీలను నెల రోజుల ముందే చూసేవాళ్లమని, ఇప్పుడు ఎందుకు అలా చేయలేకపోతున్నామని ప్రశ్నించారు. ఒకప్పుడు తన 'నిన్నే పెళ్లాడతా', 'అన్నమయ్య' సినిమాల టైమ్‌లో.. రిలీజ్‌కు నెల రోజుల ముందే పూర్తి సినిమా రెడీగా ఉండేదని గుర్తుచేసుకున్నారు. "ఇప్పుడు ఎందుకు అలా ప్లాన్ చేసుకోలేకపోతున్నాం? సినిమా బాగుండాలన్నా, అందరూ ప్రశాంతంగా పనిచేయాలన్నా రిలీజ్‌కు కనీసం రెండు వారాల ముందే పనులన్నీ పూర్తి చేసి ఫైనల్ కాపీ రెడీగా ఉంచాలి" అని నాగార్జున కోరారు. ఇది కేవలం వేరే వాళ్ల కోసం మాత్రమే కాదని, తనతో సహా ఇండస్ట్రీలోని దర్శకులు, నిర్మాతలు అందరూ ఆలోచించుకోవాల్సిన విషయమని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో సంచలనంగా మారాయి.



## బాలీవుడ్‌లో అన్నీ పనికిరాని రోల్స్ ఇస్తారు..

తెలుగు, హిందీ చిత్రాలతో స్టార్ హీరోయిన్ గుర్తింపు తెచ్చుకున్న కాజల్ అగర్వాల్ ప్రస్తుతం సెకండ్స్ ఇన్నింగ్స్‌లో అచూతూచీ అడుగులు వేస్తున్నారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని ఒప్పుకోకుండా.. తనకు నచ్చిన పాత్రలనే ఎంచుకుంటున్నారు. బాలీవుడ్‌లో సినిమాలు తగ్గించేశారు. త్వరలో 'ది ఇండియన్ స్టోరీ' మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. అలాగే ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ'లో కీలక పాత్రలో కనిపించబోతున్నారు. రెండు భాగాలుగా రాబోతున్న ఈ చిత్రంలో కాజల్ మండోదరి పాత్రలో నటిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ మూవీ రెండు భాగాలుగా రాబోతుండగా.. మొదటి పార్ట్ ఈ ఏడాది దీపావళి కానుకగా విడుదల కాబోతుంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఒక పోడ్‌కాస్ట్ లో పాల్గొన్న కాజల్ హిందీ సినిమాలను ఎందుకు తక్కువగా ఒప్పుకుంటున్నారో వెల్లడించారు. దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనకు దక్కిన నటనకు ప్రాధాన్యమున్న పాత్రలు బాలీవుడ్‌లో లభించలేదని కాజల్ పేర్కొన్నారు. పనికిరాని రోల్స్‌కు బదులు మంచి నాణ్యత ఉన్న చిత్రాలకే తాను మొదటి ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. నటనను ప్రేమించి చేయడానికి భాష ఎప్పుడూ తనకు అడ్డంకి కాలేదని ఆమె స్పష్టం చేశారు.

అలాగే సెట్‌లో క్రమశిక్షణ, సమయపాలన విషయంలో బాలీవుడ్‌లో పద్ధతి లేదని అభిప్రాయపడ్డారు. బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్ షూటింగ్ సమయంలో తనను చాలా సేపు వేచి చూసేలా చేశారని గుర్తుచేసుకున్నారు. ఆయన మధ్యాహ్నం లేదా సాయంత్రం వేళల్లో సెట్‌కి వచ్చేవారని, ఆ సమయంలో తాను షూటింగ్ ప్రాంతంలోని జిమ్‌లోనే వర్కౌట్లు చేసుకునేదాన్నని తెలిపారు. సౌత్‌లో ఉండే సమయపాలనకు అలవాటుపడిన తనకు ఇది కాస్త వింతగా అనిపించిందని చెప్పారు. ఇక సినిమాల్లో హీరోయిన్ల పాత్రల గురించి మాట్లాడుతూ.. సౌత్ పరిశ్రమలో ఇప్పుడు మంచి మార్పు వచ్చిందని కాజల్ ప్రశంసించారు. ఒకప్పుడు సినిమాల్లో హీరోయిన్ల బొడ్డు భాగాలనే ఎక్కువగా చూపించడం, వాటిపై పండ్లు విసిరే సన్నివేశాలు చిత్రీకరించడం వంటివి చేసేవారని చెప్పారు. కానీ తాను మొదటి నుంచీ అలాంటి సన్నివేశాలకు దూరంగానే ఉంటూ స్పష్టమైన హద్దులు గీసుకున్నానని తెలిపారు. ఇప్పుడు సౌత్‌లో కూడా మహిళలకు ప్రాధాన్యం ఉండే మంచి కథలను రాస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు.



## బాక్సాఫీసు వద్ద బిగ్ ఫైట్.. సూర్యతో పోటీకి దిగుతున్న లేడీ సూపర్ స్టార్







ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా కోలీవుడ్ బాక్సాఫీస్ వద్ద భారీ ఫైట్ జరగబోతోంది. గతంలో పలు విజయవంతమైన సినిమాల్లో జంటగా నటించి మెప్పించిన వర్సటైల్ హీరో సూర్య, లేడీ సూపర్ స్టార్ నయనతార.. ఈసారి బాక్సాఫీస్ బరిలో ప్రత్యర్థులుగా పోటీ పడుతుండటం విశేషం. సూర్య నటిస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్', నయనతార నటిస్తున్న 'హాయ్' సినిమాలు రెండూ ఒకే రోజు.. అంటే ఆగస్టు 14న థియేటర్లలోకి రాబోతున్నాయి.నయనతార ప్రధాన పాత్రలో వస్తున్న 'హాయ్' చిత్రాన్ని లోకేష్ కనగరాజ్ శిష్యుడు విష్ణు ఏడవన్ తెరకెక్కిస్తున్నారు. రొమాంటిక్ కామెడీ జానర్‌లో రూపొందుతున్న ఈ సినిమాలో కవిన్ హీరోగా నటిస్తున్నారు. భాగ్యరాజ్, రాధికా శరత్ కుమార్, ప్రభు, అమృత శ్రీనివాస్, వీటీవీ గణేష్ కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. రౌడీ పిక్చర్స్, సెవెన్ స్క్రీన్ స్టూడియోస్, జీ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. సూర్య ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతోంది. తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో 'ప్రేమలు' ఫేమ్ మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తోంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీకర స్టూడియోస్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్‌పై నిర్మిస్తున్నారు. ఒకే రోజు ఈ రెండు క్రేజీ ప్రాజెక్టులు విడుదలవుతుండటంతో సినీ ప్రియుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది.

## 'మా బాబాయ్ సింహం.. త్వరలోనే మళ్లీ గర్జిస్తారు'

గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'NBK 111' సినిమా షూటింగ్‌లో నటసింహం నందమూరి బాలకృష్ణ ప్రమాదానికి గురయ్యారు. కాకినాడ పోర్ట్ ప్రాంగణంలో కీలకమైన ఫైట్ సీన్ (యాక్షన్ సీక్వెన్స్) చిత్రీకరిస్తుండగా ఆయన కాలుజారడంతో మోకాలికి స్వల్ప గాయమైంది. వెంటనే స్పందించిన చిత్ర యూనిట్ షూటింగ్‌ను నిలిపివేసి, ఆయనను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు బాలకృష్ణకు ప్రాథమిక చికిత్స అందించి, గాయం స్వల్పమైనదేనని తెలపడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. బాలకృష్ణ ప్రమాదానికి గురయ్యారనే వార్త తెలిసిన వెంటనే నందమూరి కుటుంబ సభ్యులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్, నందమూరి కల్యాణ్ రామ్ ఎక్స్ (ట్వీట్టర్) వేదికగా భావోద్వేగమైన పోస్టులు పెట్టారు.

**జూనియర్ ఎన్టీఆర్ ట్వీట్..**

"గెట్ వెల్ సూన్ బాలా బాబాయ్.. మీరు త్వరగా కోలుకోవాలని, పూర్తి ఆరోగ్యంతో ఉండాలని ఆశిస్తున్నాను. మీరు మళ్లీ పూర్తి ఫామ్‌లో సింహంలా గర్జించాలని కోరుకుంటున్నాను" అని ఎన్టీఆర్ ఆకాంక్షించారు.



**కల్యాణ్ రామ్ ట్వీట్..**

"త్వరగా కోలుకో బాబాయ్.. మీరు ఎంతగానో ప్రేమించే పనిని చేయడానికి చాలా తక్కువ సమయంలోనే మళ్లీ యాక్షన్ మోడ్లోకి వస్తారని నమ్ముతున్నాను" అని కల్యాణ్ రామ్ పేర్కొన్నారు." అని కల్యాణ్ రామ్ ఆకాంక్షించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలకృష్ణ ఆరోగ్యం స్థిరంగా ఉందని, కొన్ని రోజుల విశ్రాంతి అనంతరం ఆయన తిరిగి షూటింగ్‌లో పాల్గొంటారని చిత్రబృందం వెల్లడించింది.

## ప్రత్యేక సెట్‌లో పాట!

కథానాయకుడు మహేశ్‌బాబు.. దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి కలయికలో రూపొందుతున్న బహుభాషా చిత్రం 'వారణాసి'. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్నారు. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా గత కొన్నిరోజులుగా హైదరాబాద్‌లో చిత్రీకరణ చేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇక్కడే ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఓ భారీ సెట్‌లో పాట చిత్రీకరణ చేస్తున్నట్లు సమాచారం. దీనికి ప్రముఖ కొరియోగ్రాఫర్ బాస్కో మార్టిస్ నృత్యరీతులు అందిస్తున్నట్లు తెలిసింది. ఈ పాట చిత్రీకరణ పూర్తయ్యాక చిత్ర బృందం మే నెలంతా విరామం తీసుకోనుందని.. జూన్‌లో షూట్ తిరిగి ప్రారంభించనున్నారని తెలుస్తోంది. వివిధ యుగాలతో ముడిపడి సాగే ఆసక్తికర కథతో ఈ సినిమా ముస్తాబవుతుండగా.. మహేశ్ దీంట్లో శ్రీరాముడిగా, రుద్రగా రెండు పాత్రల్లో అలరించనున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ సినిమాకి సంగీతం: ఎంఎం కీరవాణి, కథ: కె విజయేంద్ర ప్రసాద్, ఎస్ఎస్ కంచి, మాటలు: దేవ కట్టా, ఛాయాగ్రహణం: పీఎస్ వినోద్.



## రామ్ చరణ్‌కు జోడీగా నేషనల్ క్రష్!



తెలుగు ప్రేక్షకులకు 'ఉయ్యాలా జంపాల' సినిమాతో పరిచయమైన అవికా గోర్, అతి తక్కువ కాలంలోనే తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడే తన వ్యక్తిగత జీవితంలో కీలక నిర్ణయం తీసుకున్న అవికా, ప్రస్తుతం విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తోంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పట్ల తనకున్న అభిమానాన్ని ఆమె బయటపెట్టింది. బన్నీ స్టైల్, ఆయన ఎనర్జీ అంటే తనకు ఎంతో ఇష్టమని మనసులో మాట బయటపెట్టింది. "అల్లు అర్జున్ గారు తనను తాను తీర్చిదిద్దుకునే విధానం నాకు చాలా స్ఫూర్తినిస్తుంది. ముఖ్యంగా ఆయన డాన్స్ చేసే తీరు అద్భుతం. ఆ గ్రేస్ మరెవరికీ రాదు" అని ప్రశంసలు కురిపించింది. కేవలం సినిమాల్లోనే కాకుండా, నిజ జీవితంలో కూడా అల్లు అర్జున్ ప్రవర్తించే తీరు తనను ఆకట్టుకుంటుందని అవికా తెలిపింది. "ఆయనలో ఒక తెలియని ఎనర్జీ ఉంటుంది. అది కేవలం వెండితెర పైనే కాదు, బయట కలిసినప్పుడు కూడా ఆయన నుంచి వచ్చే ఆ పాజిటివ్ వైబ్ నాకు చాలా ఇష్టం. సెల్ఫ్ మేడ్ స్టార్‌గా ఆయన ఎదిగిన తీరు ప్రతి ఒక్కరికీ ఆదర్శం" అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం అవికా చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి, ముఖ్యంగా అల్లు అర్జున్ అభిమానులు ఈ వ్యాఖ్యలను షేర్ చేస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## సెకండ్ ఇన్నింగ్స్‌లో అక్కినేని కోడలు హవా..



అక్కినేని నాగచైతన్యతో వివాహం తర్వాత నటి శోభిత ధూళిపాళ సినిమాలకు కాస్త విరామం ఇచ్చిన సంగతి తెలిసిందే. పెళ్లి తర్వాత సెకండ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించి ఫుల్ స్పీడ్‌తో వరుస అవకాశాలు దక్కించుకుంటున్నారు. ఇటీవల ఆమె నటించిన 'చీకటిలో' చిత్రం నేరుగా ఓటీటీలో విడుదలై విమర్శకుల నుంచి మంచి ప్రశంసలు అందుకుంది. సక్సెస్ జోష్‌తో ప్రస్తుతం కోలీవుడ్‌లో పా రంజిత్ దర్శకత్వంలో వస్తున్న సైన్స్‌ఫిక్షన్ మూవీ 'వెట్టువమ్'లో ఆర్య సరసన ఆమె హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ తుది దశకు చేరుకోగా, తాజాగా, శోభిత కోలీవుడ్‌లో మరొక బంపర్ ఆఫర్ సొంతం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. హీరో రవి మోహన్, జిఎన్‌డి శ్యామ్ కుమార్ కాంబోలో రాబోతున్న చిత్రంలో శోభిత హీరోయిన్‌గా ఎంపికైనట్లు తెలుస్తోంది.

ఒక థ్రిల్లర్ కథాంశంతో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో రవి మోహన్ ఒక అకౌంటెంట్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఈ సినిమాకు అనిరుధ్ సంగీతం అందిస్తుండగా, ఆయనతో ఇప్పటికే ఒక స్పెషల్ ప్రోమో వీడియోను కూడా చిత్రీకరించారు. అయితే ఈ సినిమాకు 'వైట్' అనే టైటిల్‌ను పెట్టాలని మూవీ మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో రవి మోహన్, శోభిత ధూళిపాళ కాంబినేషన్‌లో వచ్చిన చిత్రం 'పొన్నియిన్ సెల్వన్' బాక్సాఫీస్ వద్ద ఎంతటి సంచలన విజయాన్ని సాధించిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు మళ్లీ వీరిద్దరి కాంబోలో మరొక థ్రిల్లర్ సినిమా రాబోతుండటంతో అటు తమిళంలోనూ, ఇటు తెలుగులోనూ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394